RENUKA
Book Binding Works
S.R.T. 22, Jawaharnagar,
Opp. Citizen Press,
R.T.C. Cross Roads,
Hyderabad - 20. (A.P.)
Ph. : 7600697

సంపుటము – VI
నెం.

11 జూలై, 1994,
సోమవారము,
(శక సం. 1916,
ఆషాడం–20).

21 OCT 1995

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపములు

## అధికార నివేదిక

## విషయ సూచిక

| | | పేజీ. నెం. |
|---|---|---|
| సంతాప ప్రతిపాదనలు: | | |
| 1. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ ఎన్. వెంకటరత్నం నాయుడుగారి మృతిపట్ల సంతాపము". | .. | 1 |
| 2. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ గోలి వీరాంజనేయులుగారి మృతిపట్ల సంతాపము". | .. | 4 |
| 3. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ చెన్నయ్యగారి మృతిపట్ల సంతాపము". | .. | 9 |
| 4. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కె. ఇ. మాదన్నగారి మృతిపట్ల సంతాపము". | .. | 9 |
| 5. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ డి. రామచంద్రరాజుగారి మృతిపట్ల సంతాపము". | .. | 9 |
| 6. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కాకర్లపూడి రామచంద్రరాజు బహదూర్‌గారి మృతిపట్ల సంతాపము". | .. | 9 |

(తరువాయి 3వ కవరులో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముద్రణాలయ కమీషనరుగారిచే శాసనసభ ముద్రణాలయము, హైదరాబాదునందు ముద్రించబడినది.

1994.

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధానాధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ డి. శ్రీపాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ బి. వేదవ్యాస్ |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | డాక్టర్ టి. వెంకయ్య |
| | : | శ్రీ సి. నర్సిరెడ్డి |
| | : | శ్రీమతి మేరీ రవీంద్రనాథ్ |
| | : | శ్రీమతి కె. ప్రతిభా భారతి |
| | : | శ్రీ మహమ్మద్ రజబ్ అలీ |
| | : | శ్రీ ఎన్. రాఘవరెడ్డి |
| కార్యదర్శి | : | శ్రీ ఎ.వి.బి. కృష్ణమూర్తి |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ ఎ. పద్మనాభన్ |
| | : | శ్రీ ఎ.డి. భాస్కర రెడ్డి |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ టి.ఎస్. రామచంద్రరావు |
| | : | శ్రీ ఎస్. స్టైలాస్ |
| | : | శ్రీ ఎం. శ్రీరామమూర్తి |
| | : | శ్రీ బి. సుబ్బారావు |
| సహాయ కార్యదర్శులు | : | కుమారి ఓ. ఇందిరాదేవి |
| | : | శ్రీ ఎస్.డి. కమలాకర్ |
| | : | శ్రీ టి.వి. శర్మ |
| | : | శ్రీ ఎమ్‌హెచ్. కేశవరావు |
| | : | శ్రీ అహమ్మద్ అతావుల్లా |
| | : | శ్రీమతి టి. అంజనీబాయి |
| | : | శ్రీ టి.వి. సత్యనారాయణ |
| | : | శ్రీ కె.వి.డి. జ్ఞానకన్ |
| | : | శ్రీ ఎస్. సువర్ణరాజు |
| | : | శ్రీ ఖాజామొయినుద్దీన్ |
| చీఫ్ రిపోర్టరు | : | శ్రీ ఇ. నరసయ్య |

పేజి. నెం


7. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ గోపాల రావు ఎక్బోటేగారి మృతిపట్ల సంతాపము". 11

8. "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి మృతిపట్ల సంతాపము". 15

ज-225.

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

(పదమూడవ సమావేశము : మొదటి రోజు)

సోమవారం, 11 జూలై, 1994.

(సభ ఉదయం 9.00 గంటలకు సమావేశమైనది)

(సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు)

### సంతాప ప్రతిపాదనలు

### (1) ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ ఎస్. వెంకటరత్నంగారి మృతిపట్ల సంతాపము

**Mr. Speaker:**- I wish you all Good Luck. Now, as per Agenda the Honourable Chief Minister will move Condolence Motions.

ముఖ్యమంత్రి (శ్రీ కె. విజయ భాస్కరరెడ్డి):- అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ ఎస్. వెంకటరత్నం నాయుడుగారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నది.

శ్రీ సువ్వుల వెంకటరత్నం నాయుడుగారు తొలిసారి 1972 నుండి 78 వరకూ 1978 నుంచి 1983 వరకూ 1989 నుంచి 1994 వరకూ మూడుసార్లు నెల్లూరు జిల్లా రాపూరు నియోజకవర్గం నుంచి శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు నియోజకవర్గ ప్రజలకు పెక్కు సేవలందించారు. వీరు గత కొద్ది నెలలుగా మెదడులో రక్త నాళాలు గడ్డ కట్టడం వల్ల శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చికిత్స పొందు తున్నారు. వీరు 19వ తేదీ ఏప్రిల్ 1994 మంగళవారము గుండెపోటుతో మరణించారు. వీరి వయసు 55 సంవత్సరాలు. వీరు ఒక సంవత్సరం పాటు హాస్పిటల్‌లో తిరుపతిలో

---

*An asterisk before the name indicates confirmation by the Member.

ఉన్నారు. నేను ఒకసారి వెళ్ళి వేరిని పరామర్శించి వచ్చాను. డాక్టర్లు చాలా ఆశాజనకంగా చెప్పారు. వారు కోలుకుంటున్నారన్న ఉద్దేశ్యం చెప్పారు. చాలా సంతోషం అయింది. వారి కుటుంబ సభ్యులు అంతా కలసి చాలా సంతోషించాము. కాని నేను చూసి వచ్చిన తరువాత కొద్ది రోజులకే గుండెపోటుతో చనిపోవడం దురదృష్టం. వ్యక్తిగతంగా మొట్టమొదట శాసన సభ్యులుగా నాకు చాలా పరిచయస్తులు. నాకు చాలా కావలసిన వారు. చాలా స్నేహశీలి. శాసన సభ్యునిగా వారు నియోజకవర్గంలో బాగా పని చేసిన వ్యక్తి. వారు చనిపోవడం వారి కుటుంబానికే కాకుండా రాష్ట్రానికి, శాసనసభకు వ్యక్తిగతంగా నన్ను కూడా చాలా తీవ్రమయిన శోకంలో ముంచింది. వారి కుటుంబానికి సానుభూతిని తెలియ జేస్తున్నాను.

శ్రీ పి. నాగేశ్వరరావు (ఖమ్మం) :– అధ్యక్షా, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. శ్రీ వెంకటరత్నం నాయుడు ఇప్పుడు మన మధ్య లేరు. దురదృష్టవశాత్తు ఆయన ప్రజాసేవ చేయవలసిన బాధ్యత ఉన్న పరిస్థితులలో మధ్యలో ఆయన అకస్మాత్తుగా మరణించడం జరిగింది. సర్ నాకు తెలుసు – ఆయన స్నేహశీలి. ప్రజల సమస్యలను పరిష్కరించే దానిలో అరమరికలు లేకుండా అన్ని పార్టీలతో కలసి మెలసి ఉండడానికి ఇష్టపడే వ్యక్తి. అటువంటి వ్యక్తి ప్రజా ప్రతినిధిగా మరింత ఔన్నత్యం సంపాదించవలసిన కాలంలో వారు అకాల మరణానికి గురయ్యారు. వారి మరణానికి నా సంతాపాన్ని ప్రకటన చేస్తున్నాను. వారి కుటుంబానికి అలాగే కాంగ్రెస్ పార్టీకి ఏర్పడిన లోటును భర్తీచేసుకోవడానికి విశ్వాసంతో ముందుకు నడవడం ఒక్కటే మార్గమని నా అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి. ముద్దుకృష్ణమనాయుడు (పుత్తూరు) :– అధ్యక్షా, శ్రీ నువ్వుల వెంకట రత్నం నాయుడు నెల్లూరు జిల్లా రాపూరు నియోజకవర్గం నుంచి 1978, 1983 మరియు 1989 లో శాసన సభ్యునిగా ఎన్నిక కావడం ఆ జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడం, వారు వివాదరహితంగా పార్టీపరంగా కాంగ్రెస్–ఐ పార్టీకి సంబంధించిన వ్యక్తి అయినా వివాదరహితంగా ఉన్నారు. ఆయన ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన దాదాపు ఒక సంవత్సరంపాటు స్విమ్స్‌లో వున్నారు. నేను కూడా రెండు పర్యాయాలు హాస్పిటల్‌కు వెళ్ళి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి చూడడం జరిగింది. రెండు పర్యాయాలు వెళ్ళినా ఆయన కోమాలో వున్నారు. మరొక పర్యాయం వెళ్ళినప్పుడు రికగ్నైజ్ చేశారు. వారు మరణించడం నెల్లూరు జిల్లాకు అదే విధంగా మన రాష్ట్రానికి లోటుగా భావిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి మా పార్టీ పరంగా సంతాప సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ బి. వెంకటేశ్వరరావు (మధిర) :– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ఈ శాసన సభ సభ్యులైన శ్రీ ఎస్. వెంకటరత్నం నాయుడుగారి మృతిపట్ల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మా పార్టీ తరఫున బలపరుస్తున్నాను. ముఖ్యంగా వెంకటరత్నం నాయుడు అకాల మరణం

చాలా విచారకరం. ఆయన స్నేహశీలే కాకుండా ఒక రకంగా పరిమితమయిన పద్ధతిలో అవసరమయిన సందర్భంలో మాట్లాడడం, అనవసరమయిన సంభాషణ చేయకుండా ఉండడం – మిత భాషి. ఆయన మరణం ఆ జిల్లా వాసులకే కాకుండా రాష్ట్ర శాసన సభకు కూడా మంచి సదభిప్రాయాన్ని వెలిబుచ్చే శాసన సభ్యుని కోల్పోవడం జరిగింది. ఆ రకంగా వారి మృతిపట్ల మా పార్టీ తరఫున వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తూ, వారి మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. జనార్ధనరెడ్డి (వెంకటగిరి):– అధ్యక్షా, ఈ సభలో గౌరవ సభ్యులు ఎస్. వెంకటరత్నం నాయుడు ఇక్కడ లేరు అనుకోవడం చాలా దుఃఖంతో కూడిన విషయం. నెల్లూరు జిల్లా రాజకీయాలలో ఒక శాంతమూర్తి శ్రీ నాయుడు. నెల్లూరు జిల్లాలో బెంమ రామనాయుడు మరణం తరువాత నాయుడుగారంటే మాకు వెంకటరత్నం నాయుడుగారే. అంతటి గౌరవం, అంతటి ఆప్యాయత ప్రజల దగ్గర, పెద్దల దగ్గర పొందిన వ్యక్తి. వెంకటరత్నం నాయుడు అకాల మరణానికి గురయ్యారు. ఏ సమస్య అయినా నిశితంగా అర్థం చేసుకొని ప్రాపర్‌గా రిప్రజెంట్ చేయగలిగిన శాసన సభ్యుడు. ఎంతో ఎనలేని సేవ చేశాడు. రాపూరు నియోజకవర్గ ప్రజల జీవితాలలో తన జీవితాన్ని మేళవింపు చేసుకుని తన విధ్యుక్త ధర్మాన్ని శాసన సభ్యుడిగా నిర్వహించిన వ్యక్తి. ఆయన కండలేరు రిజర్వాయరు క్రింద ముంపు భూములకు పరిహారం కోసం ఎంతో తపన పడ్డారు. ఎంతో శ్రమ పడ్డారు. గడప గడప తొక్కి వారికి న్యాయం చేకూర్చడానికి ప్రయత్నం చేసి లోక్ అదాలత్ ద్వారా ఏదయితే నిర్ణయం చేస్తామో దానిని రైతులకు అందించాలని ఒక అవగాహనతో ప్రభుత్వం వద్దకు రైతులతో వచ్చారు. సుప్రీంకోర్టు జడ్జి ఆ రోజులలో అదాలత్ కార్యక్రమాలు చూస్తున్న అప్పుడి ఆయన నియోజకవర్గానికి రప్పించి ఆ రైతుల సమస్యలతో లోక్ అదాలత్‌లో మొట్టమొదట కాంపెన్సేషన్ వారి ద్వారానే ఇవ్వడం జరిగింది. కాని దురదృష్టం. అది అంతటితో ఆగిపోయింది. ఈ దురదృష్టాన్ని ప్రభుత్వం సవరించగలదన్న నమ్మకం నాకు ఉంది. ఆయన ఆత్మ శాంతికి ఆ రైతుల కొరకు ఇది కొంతవరకూ చేస్తే సహాయపడుతుందని చెప్పి నా అభిలాష. ఏది ఏమయినా చక్కటి పార్లమెంటేరియన్. ఒక సౌమ్యవాది. ఒక అభ్యుదయవాది. మంచి శాసన సభ్యులు. రాష్ట్రానికి, జిల్లాకు ఎంతో సేవ చేసిన వ్యక్తి లేకపోవడం దురదృష్టం. వారి ఆత్మ శాంతికి, వారి కుటుంబానికి ఈ సభలో ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుతాపాన్ని నేను కూడా బలపరుస్తున్నాను. సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. ఓంకార్ (నర్సంపేట):– అధ్యక్షా, తోటి సభ్యులు, గౌరవనీయులైన 9·10
వెంకటరత్నం నాయుడుగారు వయస్సు చిన్నదే అయినప్పటికి దీర్ఘకాల వ్యాధితో అకాల ఉ·
మరణం చెందడం చాలా విచారకరం. తాను ఏ పార్టీలో వున్నా అందరితో మంచిగా వుండే వారు. అలాంటి ప్రముఖమైన ఒక ప్రజా సేవకుడు అకాల మరణం చెందడం చాలా దురదృష్టకరం. వారి మరణంపట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్:- సువ్వుల వెంకటరత్నం నాయుడుగారి మరణం పట్ల సభలో తెలియపరచిన ఆవేదనతో నేను ఏకీభవిస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషములు మౌనం పాటించాలని కోరుతున్నాను.

(సభ రెండు నిమిషములు మౌనం పాటించినది)

## (2) ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ గోలి వీరాంజనేయులుగారి మృతిపట్ల సంతాపము

శ్రీ కె. విజయభాస్కరరెడ్డి:- ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ గోలి వీరాంజనేయులుగారి మరణం పట్ల ఈ సభ వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, వారు చనిపోక ముందు, కొద్ది రోజుల ముందరనే నన్ను కలిసి చేనేత సమస్యల గురించి చర్చించారు. ఢిల్లీకి వెడుతున్నాను అని నాతో చెప్పలేదు కానీ ఢిల్లీకి వెళ్ళి మరల తిరిగి రాలేదు. గోలి వీరాంజనేయులుగారు లేరనే భావం ఈ నాటికి నాకు కలగడం లేదు. నిరంతరం చేనేత వృత్తులలో వుండే వారికి సహాయం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతూ వారికి సహాయం చేస్తూ వుండే వ్యక్తి. సౌమ్యశీలి. ఎనాళ్ళనుంచో కాంగ్రెస్‌ను నమ్ముకున్న జాతీయవాది. మరి అలాంటి వ్యక్తి ఈనాడు మనకు లేరు. నిజంగా గోలి వీరాంజనేయులు ఎంత శ్రమ పడే వారో తెలుసుకుంటే అలాంటి వ్యక్తి లేనందుకు నాకు చాలా విచారం కలుగుతున్నది. నా తరఫున, శాసన సభ్యుల తరఫున వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ ఎం. పెద్దిరత్తయ్య (ప్రత్తిపాడు):- అధ్యక్షా, గోలి వీరాంజనేయులుగారు మా జిల్లాకు సంబంధించిన వ్యక్తి. ఇక్కడ కూడా న్యూ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో నేను వారు ఎదురెదురు క్వార్టర్స్‌లో వుండే వారము. ఈ శాసన సభ ప్రారంభ కాలం నుంచీ కూడా వారిని నేను అబ్జర్వ్ చేస్తూ వున్నాను. వారు ఎంతో స్నేహశీలి. ఆ పార్టీ, ఈ పార్టీ అని లేకుండా వారు వున్న చోట ఆహ్లాదకరమైన వాతావరణంలో అందరు కూడా స్నేహ పూర్వకంగా, ఆప్యాయంగా మాట్లాడుకోవడం జరుగుతూ వుండేది. ఆయన చాలా నిరాడంబరంగా వుండే వారు. ఎప్పుడు ఎవరో ఒకరిని, ఆ నియోజకవర్గం నుంచి వచ్చిన వారిని తీసుకుని ఏదో పనుల కోసం నిరంతరం కృషి చేస్తూ వుండడం నేను చూస్తూ వుండే వాడిని. ముఖ్యంగా చేనేత కార్మికుల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతూ వుండే వారు. అలాంటి వివాదరహితుడు, స్నేహశీలి, సాధు స్వభావుడు అనుకోకుండా అకాల మృత్యువు వాత పడడం ఎంతో విచారకరమైన విషయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటూ, వారి కుటుంబానికి మా పార్టీ తరఫున, నా తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సిహెచ్. విఠల్‌రెడ్డి (నర్సాపూర్) :- అధ్యక్షా, గోలి వీరాంజనేయులుగారు
రాజకీయాలకు వచ్చినప్పటి నుంచీ చేనేత రంగంలో సుదీర్ఘంగా పనిచేశారు. వారు ఏ
సిద్ధాంతాన్ని నమ్మారో దానిని చేరే వరకు ఆ సిద్ధాంతం పైననే పని చేశారు. క్రమశిక్షణ
కలిగిన వ్యక్తి. వినయంతో వుండే వారు. అదీ గాక బలహీనవర్గాల నుంచి వచ్చిన వ్యక్తి.
వారు చాలా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. బి.సి. కమిటీకి కూడా అధ్యక్షులు
వారితో నాకు చాలా సంవత్సరాల పరిచయం వున్నది. గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు
ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరఫున బలపరుస్తూ, వారి ఆత్మకు శాంతి
కలగాలని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. రాఘవరెడ్డి (నకిరేకల్) :- అధ్యక్షా, గోలి వీరాంజనేయులుగారి మృతికి
సంతాపాన్ని తెలియచేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానంతో నేను ఏకీ
భవిస్తున్నాను. అసలే మన శాసన సభలో చేనేతకు సంబంధించిన ప్రతినిధులు తక్కువ.
ఉన్న ఒకరిద్దరిలో ఆ ఒక్కరు చనిపోవడం చాలా లోటయిన విషయం. అదే విధంగా వారు
వెనుకబడ్డ జాతుల అభివృద్ధి సంఘానికి అధ్యక్షులుగా వుండి దానిపైన కొంత కృషి
చేస్తూ, ఆకస్మికంగా చేనేత సమస్యల గురించి మాట్లాడటానికి ఢిల్లీకి వెళ్ళి చనిపోవడం
అనేది చేనేత కార్మికులను చాలా వేధిస్తున్న సమస్యగా వున్నది. ఎందుకంటే ఇవాళ చేనేత
కార్మికులు చాలా తీవ్రమైన సంక్షోభాన్ని ఒక వైపున ఎదుర్కొంటున్న సందర్భంలో వాళ్ళ
ప్రతినిధి చనిపోవడం అనేది చాలా బాధాకరమైన విషయం. వారి మరణానికి మా పార్టీ
తరఫున తీవ్ర సంతాపాన్ని తెలియచేస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియచేస్తే ఈ
అవకాశం ఇచ్చినందులకు ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

సమాచార శాఖ మంత్రి (శ్రీ డి. శ్రీనివాస్) :- అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్య
మంత్రిగారు ప్రతిపాదించిన తీర్మానంతో నేను ఏకీభవిస్తున్నాను. ఈ రోజు, ఈ సభలో
గోలి వీరాంజనేయులుగారు లేకపోవడం చాలా దురదృష్టకరం. ఎందుకంటే ఆయన ఎంతో
చురుగ్గా అసెంబ్లీ లాబీల్లో కానీ, హౌస్‌లో కానీ, ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో కానీ, వారి
నియోజకవర్గంలో కానీ ఎక్కడయినా పని చేస్తూ వుండే వారు. బలహీనవర్గాల అభివృద్ధి
కొరకు ఎంతో కష్టపడుతూ, వెనుకబడిన తరగతుల వారి ప్రతినిధిగా ఎదుగుతూ వస్తూ
వున్న సమయంలో, ఈ రకమైన అవాంఛనీయ సంఘటన జరిగి వారు మరణించడం చాలా
దురదృష్టకరమైన విషయం. ఆయన చురుకుదనాన్ని చూసి నేను ఆయనకు ఒక పేరు
కూడా పెట్టాను. మీరు గోలి వీరాంజనేయులు కాదు అయ్యా, మీ మారు పేరు బుల్లెట్
వీరాంజనేయులు అని పిలిచే వాడిని. శ్రీ గోలి వీరాంజనేయులు నియోజకవర్గంలో నేను 9.20 ఉ.
రెండుసార్లు పర్యటించే అవకాశం నాకు కల్గింది. ఆ పర్యటనలో నేను ఆయన్ని "బులెట్
ఆంజనేయులు" అని సంబోధించినపుడు ఆ నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆనందపడ్డారు.
పద్మశాలీ కుటుంబంలో జన్మించిన ఆయన, చేనేత కార్మికుల సమస్యల కొరకు నిరంతరం
పాటుపడేవారు. అటువంటి వ్యక్తి అకాలమరణం చెందడం ఈ అసెంబ్లీకే కాక, కాంగ్రెస్
పార్టీకి ముఖ్యంగా వెనుకబడిన తరగతుల వారికి ముఖ్యంగా చేనేతరంగానికే తీరని నష్టం

అని మనవిచేస్తూ, వారి యొక్క ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా యొక్క సానుభూతిని తెలియపరుస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎం. ఓంకార్:— గౌరవ తోటి శాసనసభ్యుడు శ్రీ గోలి వీరాంజనేయులుగారి యొక్క అకాల మృతిపట్ల నేను తీవ్రమైన బాధను వ్యక్తం చేస్తున్నాను. చేనేతరంగంలో, వారు చేసిన కృషికి అందరి మన్ననలను పొందిన వ్యక్తి ఆయన కావడం ప్రత్యేకమైన అంశం. వారి యొక్క అకాల మరణం పట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను.

ఉన్నత విద్యా శాఖ మంత్రి (శ్రీ ఎ. ధర్మారావు):— అధ్యక్షా, గోలి వీరాంజనేయులుగారి అకాల మరణం, అందులో హఠన్మరణం కూడ అయిన విషయం నాకు చాల దిగ్భ్రాంతి కల్గించింది, ముఖ్యంగా మా గుంటూరు జిల్లా ప్రజలకు. వీరాంజనేయులుగారు ఒక సామాన్య కాంగ్రెస్ కార్యకర్తగా 30, 40 సంవత్సరాలపాటు కష్టపడి, తనయొక్క స్వీయ ప్రతిభ, విశిష్ట సేవల వల్ల మంచి పేరు పొందినందున, ఆయన శాసనసభ్యుడి దాకా ఎదగడం జరిగింది. జిల్లా లైబ్రరీ ఉద్యమంతో ఆయనకు చాల సన్నిహిత సంబంధం ఉంది. లైబ్రరీ ఉద్యమాన్ని ఆయన బాగ బలపరిచి వృద్ధి చేశారు. అదే విధంగా చేనేత కార్మికులకు ఎంతో అండగా ఉండి కృషి చేశారు. రాష్ట్ర సమైక్యతకు భంగం కలిగే సమయంలో రాష్ట్ర సమైక్యతను కాపాడే లక్ష్యంతో హృదయపూర్వకంగా ఎంతో కష్టపడి దేశ శ్రేయస్సును నిలబెట్టడంలో కృషి చేశారు.

ఆయన మరణం వెనుకబడిన తరగతుల్లకు ముఖ్యంగా చేనేత కార్మికులకు తీరని లోటు అని చెప్తుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, సెలవు తీసుకొంటున్నాను.

కార్మిక మరియు ఉపాధికల్పన శాఖమంత్రి (శ్రీ కె. లక్ష్మీనారాయణ):— అధ్యక్షా, గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ, గోలి వీరాంజనేయులుగారు చనిపోవడం గుంటూరు జిల్లాకే కాకుండా, కాంగ్రెస్ పార్టీకి కూడ తీరని లోటు అని తెలియచేస్తున్నాను. నేను ఖమ్మం జిల్లా పర్యటనలో ఉండగా పేపర్లో ఆయన ఫోటో చూసి ఆయనకు ఏదైనా పదవి వచ్చిందేమోనని చదివితే, వారు ఢిల్లీలో అకాల మరణం పొందారని తెలుసుకోగానే, నేను ఒక రకమైన దిగ్భ్రాంతి చెందడం జరిగింది ఎందుకంటే, నేను యువజన కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నప్పటి నుండి వారితో నాకు పరిచయాలు ఉన్నాయి. వారు చేనేత రంగానికి, వెనుకబడిన తరగతుల వారికి, అలాగే మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు ఆయన ఎనలేని కృషి చేశారు. కొండవీటి వాగు ప్రాజెక్టును సాధించి తన నియోజకవర్గ ప్రజలకు నీటి సదుపాయం కల్పించాలనే ఉద్దేశ్యంతో, చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారిని పిలిపించి, ఆ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయించారు. కొండవీటి వాగు ప్రాజెక్టు గురించి ఆయన డిస్ట్రిక్ట్ ప్లానింగ్

బోర్డులో ప్రతిసారి మాట్లాడుతుండే వారు. సర్దార్ గోలి వీరాంజనేయులుగా పేరు తెచ్చుకొన్న ఆయన గుంటూరు జిల్లాలోనే ఒక మంచి నాయకుడుగా ఎదిగారు. అటువంటి వ్యక్తిని పోగొట్టుకొన్నందుకు విచారం వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను.

శ్రీ కె. ఎర్రన్నాయుడు (హరిశ్చంద్రాపురం):- అధ్యక్షా, తోటి సభ్యులు, పూజ్యులు గోలి వీరాంజనేయులు మరణ వార్త చాల దిగ్భ్రాంతికి గురి చేసింది. మా బి.సి. వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులుగా సుమారు 18 నెలలు వారితో పనిచేసే భాగ్యం నాకు కల్గింది. రోస్టర్ను విషయంతో బి.సి.లకు ఏమైనా అన్యాయం జరిగితే, అధికారులను మందలించే ధోరణిలో ఆదేశాలు ఇస్తూ, బి.సి.ల సంక్షేమం పట్ల ఆయన పాటుపడ్డారు. వారి మరణం చాల తీవ్రమైన లోటు.

బి.సి. వెల్ఫేర్ కమిటీ మీటింగ్ 29వ తేదీ అని చెప్పి నోటీసులు కూడ పంపడం, వాటిని మేము అందుకోవడం కూడ జరిగింది. కాని ఇంతలోనే వారు కనిపించకుండా పోయారు. ఈ సందర్భంలో వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియపరుస్తూ, సెలవు తీసుకొంటున్నాను.

చేనేత మరియు జౌళి శాఖమంత్రి (శ్రీ పులి వీరన్న):- అధ్యక్షా, పెద్దలు గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, శ్రీ గోలి వీరాంజనేయులుగారి మరణం పట్ల నా విచారం వ్యక్తం చేస్తున్నాను. వారు నాకు బాగా తెలిసిన వారు. వారు చనిపోయిన రోజు యావత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యంగా చేనేత కార్మికులకు తీరని లోటు అని అందరూ బాధపడ్డారు. వారు నాలుగు దశాబ్దాల పాటు చేనేత రంగానికి ఎనలేని సేవ చేసి, చేనేత కార్మికుల సమస్యలను అవగాహన చేసుకొని, పరిష్కరించేందుకు పాటుపడ్డ వ్యక్తి. అటువంటి ఆయన ఈనాడు మన మధ్య లేకపోవడం మన అదరికీ లోటే. కేవలం చేనేత రంగానికే వారు పరిమితం కాకుండా, బి.సి. వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్‌గా ఉంటూ, ప్రతి జిల్లాలో పర్యటిస్తూ, బి.సి.లకు చెందిన ఏమైన బ్యాక్‌లాగ్ వేకన్సీలు ఉంటే, వాటిని భర్తీచేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చి, బి.సి.లకు న్యాయం చేసే వారు. గోలి వీరాంజనేయులు కమిటీ ఛైర్మన్ అయిన తరువాత, మున్నెన్నడూలేని విధంగా, బి.సి.ల సంక్షేమం గురించి చాల మీటింగ్‌లు పెట్టినట్లు మేము వినడం జరిగేది. వారు చాల నిరాడంబర జీవి. వారి అంత్యక్రియలకు నేను వారి నియోజక వర్గానికి వెళ్లినపుడు ప్రతి ఒక్కరు వారి కుటుంబంలో ఒక వ్యక్తిని పోగొట్టుకొన్నట్లుగా బాధపడ్డారు. అంతటి ప్రజాభిమానం పొందిన వ్యక్తి ఈనాడు లేకపోవడం నిజంగా చాల బాధాకరంగా ఉంది. అందులో ప్రత్యేకంగా నాకు తీరని లోటు. అసెంబ్లీలో ప్రతి ఒక్కరు "గోలి" "పులి" అని పిలుచుకొనే వారు. ఈ రాష్ట్రంలో ప్రతి రీజియన్‌నుండి చేనేత రంగంలో సంబంధం కల ముగ్గురు, నలుగురు ఎం.ఎల్.ఏ.లు ఉన్నారు. అందులో గుంటూరు రీజియన్ నుండి వున్న వీరాంజనేయులుగారు ఈనాడు లేకపోవడం తీరని లోటు.

ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తు చేసుకొంటూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ జె. చిత్తరంజన్‌దాస్ (కల్వకుర్తి) :– అధ్యక్షా, పెద్దలు గోలి వీరాంజనేయులుగారి యొక్క మరణం నిజంగా మా అందరికీ చాల బాధగా ఉంది. ఎప్పుడూ, నవ్వుతూ ఉంటూ, ఏదో ఒక కార్యక్రమాన్ని తీసుకొని, ఎప్పుడూ కూడ అభివృద్ధి గురించే ఆలోచించే వ్యక్తి ఆయన. మామూలు చేనేత కుటుంబంలో పుట్టి, ఎప్పుడూ చేనేత కార్మికుల సమస్యల గురించి, వాటి పరిష్కారం కొరకు ప్రయత్నిస్తూ, వారికి ఎంతో అండగా నిలబడిన వ్యక్తి. వారి మరణం ఈ రాష్ట్రంలోని చేనేత కార్మికులకే కాక, వెనుకబడిన తరగతులకే కాక, బలహీనవర్గాలకే కాక, కాంగ్రెస్ పార్టీకి కూడ తీరని లోటు అని తెలియపరుస్తున్నాను. ఎన్నో ఆశయాలు, ఎన్నో ఆశలతో ఉన్న వ్యక్తి. బి.సి. వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడిగా అనేక జిల్లాలు పర్యటించి, బి.సి. రిజర్వేషన్ అమలు గురించి గాని, వారి యొక్క ఇతర సమస్యల గురించి కాని పదే పదే మాకు చెప్పుతూ ఉండేవారు. బి.సి.లకు ఎంతో చేయాలను కొన్న వ్యక్తిని భగవంతుడు ఇంత తొందరగా తీసుకొనివెళ్ళిపోవడం చాల విచారకరమైన విషయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియచేస్తున్నాను.

9.30 ఉ శ్రీ కె. రామచంద్రరాజు (ఉండి) :– పెద్దలు శ్రీ గోలి వీరాంజనేయులుగారు మన శాసనసభ వెనుకబడిన తరగతుల కమిటీ అధ్యక్షులుగా ఎంతో కృషి చేయడం జరిగింది. నేను కూడా ఆ కమిటీలో సభ్యుడిగా వున్నాను. అన్ని జిల్లాలు పర్యటించి బి.సి.ల గురించి కూలంకషంగా వారు చర్చించినట్లు గతంలో ఎవరూ చర్చించలేదని అక్కడి అధికారులు, అనధికారులు చెబుతూ వుంటారు. ముఖ్యంగా బి.సి.ల రిజర్వేషను గురించి, వారి సంక్షేమం గురించి ఏ విధమైన మొహమాటాలకూ పోకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి, అధికారులకు వారు ఆదేశాలిచ్చేవారు. వారి మరణం ముఖ్యంగా బి.సి.లకు, రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఎంతో నష్టం. వారిలాగా పార్టీలకు అతీతంగా వుండే నాయకులు చాలా అరుదు. ప్రతిపక్షం వారైనప్పటికీ కూడా మాతో ఎంతో సౌమ్యంగా, చర్చించి ప్రధానమైన నిర్ణయాలు జాగ్రత్తగా చేసేవారు. వారి అకాల మరణం ముఖ్యంగా రాష్ట్రంలోని బి.సి.లకు చేనేత కార్మికులకు తీరని లోటుగా భావిస్తూ, వారి యొక్క ఆత్మ శాంతికి భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి నా తీవ్రమైన సంతాపాన్ని తెలియ జేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ జి. గెడ్డన్న) :– ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, గోలి వీరాంజనేయులుగారి మరణం అన్ని రంగాలకూ లోటని భావిస్తున్నాను. ఒక మంచి కార్యకర్తగా, ఒక మంచి వర్కరుగా, ప్రత్యేకంగా వెనుకబడిన తరగతులకు, జాతులకు ఒక యాక్టివ్‌గా పనిచేసే వ్యక్తిగా వారి మరణం చాలా దురదృష్టకరంగా భావిస్తూ, ముఖ్యంగా నా శాఖకు సంబంధించి అటువంటి చురుకుగా పనిచేసే వ్యక్తిని కోల్పోయానని భావిస్తూ వారికి ఆత్మశాంతి కలగాలని, మరియు వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

ఉప ముఖ్యమంత్రి (శ్రీ కె రంగారావు):– అధ్యక్షా, మన గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సానుభూతి తీర్మానాన్ని బలపరుస్తూ, బడుగవర్గాల సంక్షేమానికి జీవితాంతం కృషిచేసి, మంచి క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ నాయకుడుగా, తాను నవ్వుతూ యితరులను నవ్విస్తూ, యిప్పటివరకూ పెద్దలు చెప్పినట్లు పార్టీలకు అతీతంగా అందరితో అన్యోన్యంగా వుంటూ మంచి ప్రజాప్రతినిధిగా పేరుతెచ్చుకున్న శ్రీ గోలివీరాంజనేయులుగారిని మనం కోల్పోయాం. సమాజంలో బడుగువర్గాలకొరకు చిత్తశుద్ధితో హృదయపూర్వకంగా పనిచేసే ఒక ఉన్నతమైన ప్రజా ప్రతినిధిని కోల్పోయామని ప్రజలు విచారపడుతున్నారు. పెద్దలు చెప్పినట్లు 'సర్దార్' గోలి వీరాంజనేయులుగా వారి నియోజకవర్గంలోని ప్రజలు చాలా అభిమానంగా చూసేవారు. ఉన్నతమైన క్రమశిక్షణ గల కాంగ్రెస్‌వాది గోలి వీరాంజనేయులుగారి మరణానికి నేను విచారణ వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి నా హృదయ పూర్వకమైన సానుభూతి తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను;

మిస్టర్ స్పీకర్:– గోలి వీరాంజనేయులుగారి మరణం పట్ల సభ్యులు వెలిబుచ్చిన ఆవేదనతో ఏకీభవిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేస్తూ, రెండు నిముషాలు మౌనం పాటించుదాం.

(గౌరవ సభ్యులంతా రెండు నిముషాలు మౌనం పాటించారు)

**సంతాప ప్రతిపాదనలు**

(3) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ వై. చెన్నయ్యగారి మృతిపట్ల సంతాపము"

(4) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కె.ఇ. మాదన్నగారి మృతిపట్ల సంతాపము"

(5) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ టి. రామచంద్రరాజుగారి మృతిపట్ల సంతాపము".

(6) ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కాకర్లపూడి రామచంద్రరాజు బహదూర్‌గారి మృతిపట్ల సంతాపము".

మిస్టర్ స్పీకర్:– ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు శ్రీ యడం చెన్నయ్యగారి మరణం పట్ల ఈ సభ వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియచేస్తున్నాను.

సంతాప ప్రతిపాదనలు : (3) ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు మాజీ సభ్యులు శ్రీ వై. చెన్నయ్యగారి మృతిపట్ల సంతాపము". (4) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కె.ఇ. మాదన్నగారి మృతిపట్ల సంతాపము". (5) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ జి. రామచంద్రరాజుగారి మృతిపట్ల సంతాపము". (6) "ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కాకర్లపూడి రమచంద్రరాజు బహదూర్‌గారి మృతిపట్ల సంతాపము".

శ్రీ యడం చెన్నయ్యగారు 1955 నుండి 1962 వరకు, 1967 నుండి 1972 వరకూ, 1972 నుంచి 1978 వరకూ రేపల్లె నియోజకవర్గపు శాసనసభ్యునిగా వున్నారు. వీరు క్రింది స్థాయినుండి ప్రజా ప్రతినిధిగా ఎదిగి 3 సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించినారు. వీరు వీరి నియోజకవర్గపు ప్రజల అభివృద్ధికి చాలా పాటుపడ్డారు. ప్రజలకు వీరి మరణం తీరని లోటయినది. వీరు 1994, మే 10వ తేదీ మంగళవారం నాడు హఠాత్తుగా మరణించారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు శ్రీ కె.ఇ. మాదన్నగారి మరణం పట్ల ఈ సభ వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు.

శ్రీ కె.ఇ. మాదన్నగారు 1967 నుండి 1972 వరకూ కర్నూల్ జిల్లా డోన్ నియోజకవర్గపు శాసనసభ్యునిగా ఎన్నికైనారు. వీరు 1972 నుండి 1978 వరకూ విధాన పరిషత్ సభ్యునిగా వున్నారు. వీరు ప్రజలకు ఎక్కువ సేవలందించారు. వీరు 1994, మే 25వ తేదీ సోమవారం నాడు గుండెపోటుతో మరణించారు వీరి వయస్సు 86 సంవత్సరాలు.

ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు శ్రీ గొట్టుముక్కల రామచంద్రరాజుగారి మరణం పట్ల ఈ సభ వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు.

శ్రీ గొట్టుముక్కల రామచంద్రరాజుగారు 1978 నుండి 1983 వరకు పశ్చిమ గోదావరి జిల్లా 'ఉండి' నియోజకవర్గపు సభ్యునిగా వున్నారు.

వీరు జాతీయోద్యమంలోని అన్ని పోరాటాలలో పాల్గొన్నారు. 1930 నుండి 1947 వరకు కొనసాగిన పోరాటాలలో పాల్గొని, ఎక్కువమార్లు జైలు శిక్ష అనుభవించారు. ఆచార్య రంగా, డాక్టర్ పట్టాభిగార్లతో వీరికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఆచార్య రంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరించిన రోజులలో వీరు సెక్రటరీగా పని చేశారు. జీవితమంతా ఉద్యమమే ఊపిరిగా సాగించిన వ్యక్తి. రైతు కుటుంబంలో జన్మించి, రైతు బిడ్డగా వ్యవసాయం చేస్తున్న రోజులలో మదన్‌లాల్ ఢింగ్రా, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ వంటి విప్లవ వీరుల త్యాగాలకు స్పందించి, జాతీయోద్యమం వైపు ఆకర్షితులై

గాంధీజీ ప్రభావంతో అహింసావాదిగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. కారాగార జీవితం గడిపారు. వీరు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు. వీరు 1994 మే 10వ తేదీ మంగళవారం నాడు కాకినాడ ఆసుపత్రిలో మరణించారు. వీరి వయస్సు 80 సంవత్సరాలు.

ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు శ్రీ రాజా కాకర్లపూడి రామచంద్రరాజు బహదూర్ (రాజాబాబు) గారి మరణం పట్ల ఈ సభ వారు తమ ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చుతూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు.

శ్రీ రాజా కాకర్లపూడి రామచంద్రరాజు బహదూర్ (రాజబాబు) గారు తొలిసారిగా 1955 సంవత్సరం నుండి 1962 వరకు మరియు 1983 సంవత్సరం నుండి 1985 సంవత్సరం వరకు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గపు శాసన సభ్యునిగా ఎన్నికైనారు. వీరు మున్సిపల్ ఛైర్మన్‌గా కూడా కొన్నాళ్ళు వ్యవహరించారు. వీరు గొప్ప రాజకీయవేత్త. నియోజకవర్గ అభివృద్ధికై వీరు మిక్కిలి పాటుపడ్డారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల శ్రీ రాజబాబుగారు 1994, జులై 4వ తేదీ సోమవారం నాడు పరమపదించారు. వీరి వయస్సు 74 సంవత్సరాలు.

వీరి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిముషములపాటు మౌనం పాటిద్దాము.

(గౌరవ సభ్యులు లేచి రెండు నిముషాలు మౌనం పాటించారు)

## సంతాప ప్రతిపాదనలు .

## (7) ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ గోపాలరావు ఎక్బోటెగారి మృతిపట్ల సంతాపము

శ్రీ కె. విజయభాస్కరరెడ్డి:– ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు శ్రీ గోపాలరావు ఎక్బోటె మరణంపట్ల ఈ సభ తన ప్రగాఢసానుభూతిని వెలిబుస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది.

గోపాలరావు ఎక్బోటెగారు 1952 నుండి 1955 వరకు 1957 నుండి 1962 వరకు హైదరాబాద్ మహరాజ్‌గంజ్ నియోజకవర్గ శాసన సభ్యునిగా పనిచేశారు. 1953 నుండి 1957 వరకు విద్య, మునిసిపల్ పాలనా మంత్రిగా పనిచేశారు. న్యాయశాస్త్ర కోవిదులైన వీరు హైదరాబాద్ మునిసిపల్ చట్టం వంటి అనేక చట్టాలకు రూపకల్పన చేశారు. రాష్ట్ర భాష, వివేక రాష్ట్ర అనే పుస్తకాలను రాసి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం యొక్క మన్నలను కూడా పొందారు. రాష్ట్ర రాజధానిలోని పలుసంస్థలు, సాంఘిక సేవా కార్యక్రమాలలో వీరికి సంబంధం ఉండేది. ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వీరు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. వీరు బూర్గుల రామకృష్ణారావుగారు మంత్రివర్గంలో విద్యా

శాఖ మంత్రిగా వుండి అనేక విద్యాసంస్థలలో విశేషంగా కృషిచేశారు. విద్య, సామాజిక సేవ రంగాలలో వీరు చేసిన కృషి మరువలేనిది. సామాజిక విలువల కోసం వీరు పాటుపడ్డారు. వీరు దీర్ఘంగా అస్వస్థులుగా వుండి 1994 జూన్ 4వ తేదీ, శనివారం మరణించారు. వీరి వయస్సు 82 సంవత్సరాలు.

అధ్యక్షా, వ్యక్తిగతంగా వీరు 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత నాకు చాలా సన్నిహితులు. వీరు అస్వస్థులుగా వున్నప్పుడు వెళ్ళి చూచివచ్చాను. చనిపోయిన తరువాత వెళ్ళి వారి కుటుంబానికి సానుభూతి చెప్పడం జరిగింది. అంతేకాకుండా రాష్ట్ర మర్యాదలతో వారి దహనసంస్కారం ఏర్పాటుచేశాము. ఏదయినా, చాలా మహా మేధావి, ధైర్యవంతుడు, దేశభక్తుడు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. ఆనాడు పోలీసు యాక్షన్ పెట్టముందు ఇక్కడవున్న రాజకీయ నాయకులు చాలామంది ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ఉద్యమం నడిపారు. కాని ఆయన యొక్క గొప్పదనం, ధైర్యం ఇక్కడేవుండి ఎదుర్కొని స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. చాలా స్నేహ పాత్రుడు. రాజకీయాల నుండి న్యాయమూర్తిగా వెళ్ళి, ప్రధాన న్యాయమూర్తి ఆయన చేసిన తీర్పులు చిరకాలం ఉంటాయి. ఏ పదవిలో వున్నా, సాంఘిక సంక్షేమంలో వున్నా, ముందు వుండి నాయకత్వం వహించి అన్ని కార్యక్రమాలు చాలా చక్కగా, చేసిన మహావ్యక్తి. ఆయన సేవలు చాలావరకు ఈ రాష్ట్రం మరిచిపోలేదు. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతూ, వారి మరణానికి చాలా చింతిస్తున్నాను.

శ్రీమతి కె. ప్రతిభా భారతి (ఎచ్చెర్ల):— అధ్యక్షా, శ్రీ గోపాల్‌రావు ఎక్బోటేగారు చీఫ్ జస్టిస్‌గా నాకు చిరపరిచితులు. మాతండ్రిగారు 1971 లో జడ్జిగా వున్నప్పుడు వీరు హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా వుండేవారు. అప్పటినుంచి చాలా పరిమితులు. ఎక్కడ కలిసినా చాలా ఆప్యాయంగా, ఆచరణలో, ప్రేమతో, వాత్సల్యంతో వారి స్వంత కుమార్తెలాగా పలక రించేవారు. వారు పంచాయతీరాజ్ యాక్టు ఏర్పాటుచేయడం జరిగింది. ముఖ్యంగా వారు స్వాతంత్ర్య సమరయోధులు. శాసనసభ్యుల తరువాత జుడీషియరీకి వెళ్ళిన కొంతమందిలో వారు అగ్రగణ్యులు. అటువంటి పితృతుల్యులు శ్రీ గోపాల్‌రావుగారి మరణం చాలా విచార కరమయిన విషయం. బాధ కలిగించే విషయం. వారియొక్క ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేస్తున్నాను.

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి (శ్రీ డి.కె. సమరసింహారెడ్డి):— అధ్యక్షా, ఒక శాసనసభ్యునిగా, ఒక మంత్రిగా, ఒక ప్రధాన న్యాయమూర్తిగా గోపాల్‌రావు ఎక్బోటేగారు మన రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం. వారితో న్యాయవాదిగా నాకు పరిచయం. న్యాయమూర్తిగా పరిచయం. వారి ముందుకు న్యాయమూర్తిగా, నేను ఒక న్యాయవాదిగా పలుపర్యాయాలు వారికి ఉన్న న్యాయవిజ్ఞతకు, న్యాయశాస్త్ర రంగంలో వారికి వున్న పరిపూర్ణతకు నిజంగా ఎన్నోమార్లు, గోపాల్‌రావు ఎక్బోటేగారి తీర్పులంటే ఇప్పటికీ కూడా ఆనాడు హైదరాబాద్ రాష్ట్రంలో, దేశానికే ఆదర్శపూరితమయిన టినెన్సీ చట్టంపై

వారు చెప్పిన తీర్పు నిజంగా అటు ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తుందని మనవిచేయక తప్పదు. ఫుల్ బెంచ్‌లో ఇచ్చిన తీర్పులలో అనేక పర్యాయాలు దేశవ్యాప్తంగా కొంత అలజడిని సృష్టించినా, వారి తీర్పులు సుప్రీంకోర్టు వాళ్ళు కూడా ఎంతో విజ్ఞతతో మెచ్చుకున్న తీర్పులు వున్నాయి. ఆయన మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవాడైనా ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో వున్న కాస్మో పాలిటన్ నేచర్‌కు, సంస్కృతికి వారు ప్రతీకగా వున్నారని చెప్పక తప్పదు. నాకు గుర్తు ఉంది వారు మరణానికి ఒక మాసం ముందు పోయిన శాసనసభ సమావేశాలు కాలంలో శాసనసభ లాబీలో కూర్చొని శాసనసభలో ఎలా ఎలా కార్యక్రమాలు నడుస్తున్నాయో పరిశీలన చేసిన రోజు కూడా వారు క్రిందకు వచ్చిన తరువాత మాట్లాడిన రోజు కూడా నాకు గుర్తు వుంది. అటువంటివారు ఈనాడు మన మధ్య లేకపోవడం ఒక రాజకీయ రంగానికే కాక న్యాయ శాస్త్రరంగానికి కూడా తీరని లోటు అని మనవిచేస్తూ, అటువంటి వారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరుస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానం బలపరుస్తూ, వారి ఆత్మశాంతికై భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ రజబ్ అలీ (సుజాతనగర్):- అధ్యక్షా, గోపాల్‌రావు ఎక్బోటేగారు కంపోజిట్ హైదరాబాద్ స్టేట్‌లో అనేకమయిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామి. వారు నిర్వహించిన పాత్ర చాలా గొప్పది. అందుకని వారి మరణం పట్ల నేను నా సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. రాఘవరెడ్డి:- అధ్యక్షా, గోపాల్‌రావు ఎక్బోటేగారు అసలు హైదరాబాద్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలియని పరిస్థితులలో ఆయన అసలు ప్రజాస్వామ్యం గురించి చెప్పడమే కాక అమలుజరిపి చూపినవారు. నిజాం వ్యతిరేక ఉద్యమాలలో పాల్గొన్నారు. అదే విధంగా మెర్కోటే, ఎక్బోటే అని ఇద్దరు వుండేవారు అప్పటి మంత్రివర్గంలో. అసలు వారి కాలంలోనే హైదరాబాద్ రాష్ట్రంలో పంచాయతీరాజ్ చట్టం రూపొందించబడింది. అది దేశంలోనే ఒకరకమయిన అభ్యుదయకరమయిన చట్టం అనే పేరు పొందింది. అంతేకాదు. వారు మంత్రివర్గంలో వున్నా, శాసన సభ్యులుగా వున్నా, న్యాయమూర్తిగా వున్నా, న్యాయవాదిగా వున్నా, ప్రధాన న్యాయమూర్తిగా వున్నా ప్రజాస్వామ్యం అనేది వూపిరిగా వుండేది. వారు ఎటువంటి పాక్షికత లేకుండా చాలా సవ్య మయిన మార్గంలో పనిచేసే వారు. అటువంటి మరణించడం నిజంగా మన రాష్ట్రానికి తీరని రోజు కనుక వారి మరణం పట్ల మాపార్టీ పక్షాని మేము ప్రగాఢ సంతాపాన్ని తెలియేస్తూ, వారి కుటుంబానికి మా సానుభూతి తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ నాదెండ్ల భాస్కరరావు (తెనాలి):- అధ్యక్షా, గోపాలరావు ఎక్బోటేగారి గురించి 9.50
చాలా విషయాలు చెప్పారు. కాని నేను వారి కాలేజీలో చదువుకున్నాను. మహారాష్ట్రీయులు ఏ. పెట్టిన 'లా' కాలేజీలో 1955 లో నేను కూడా విద్యార్థిని. వారు అప్పటికే మంత్రిగా

వున్నారు. భూర్గుల రామకృష్ణారావుగారి క్యాబినెట్‌లో. వారితో ప్లీడరుగా పనిచేయడమే కాకుండా, న్యాయమూర్తిగా ఒక బెంచి మీద ఉన్నపుడు, ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నేను కొన్ని కేసులను వాదించడం జరిగింది. చాలా తెలివైన వ్యక్తి. రాజకీయాల నుంచి వచ్చిన వారిలో, అందులో 'లా' లో ఇన్ని తెలివితేటలు ఎలా వచ్చాయో అని సోదర జడ్జీలు అందరూ విస్తుపోతూ ఉండేవారు. ఆయన జడ్జిమెంట్స్‌లో కాని, తదితర విషయా లలో కాని, ఎవరూ వేలెత్తి చూపించనేయకుండా ఆయన ముందుకు సాగిపోతూ ఉండేవారు. అటువంటి వ్యక్తి ఆయన. ఈ రాష్ట్రం 'కాస్మోపాలిటన్ కల్చర్' కు ప్రతీక. చాలామంది వ్యక్తులతో కలిసి, ఈ హైదరాబాదును, రాష్ట్రాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేయడానికి పాటు పడిన వ్యక్తి. వారు ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేశారు. ప్రతి వ్యక్తి పుడుతూ ఉంటాడు. పోతూ ఉంటాడు, అది సహజం.

ఈ మధ్య నేను 'ఎనెక్డోట్స్ ఆఫ్ అమెరికన్ ప్రెసిడెంట్స్' పుస్తకం చదివాను. అందులో అమెరికా 29వ ప్రెసిడెంట్ కులిడ్జ్ అనే ఆయన స్పెన్సర్ అనే ఒక సెనేటర్‌తో "ఏమిటి? ఈ బంగ్లాలో ఎవరు ఉంటున్నారు' అంటే, ఎవరో ఉంటారు, వస్తూ ఉంటారు, పోతూ ఉంటారు అని ఆ సెనేటర్ అన్నాడట. అలా వస్తూ ఉంటాము, పోతూ ఉంటాము. ఆయన చేసిన కృషికి, హైదరాబాదులో కాని, ఈ రాష్ట్రంలో కాని, ప్రజలు వారికి తప్పక నివాళులు అర్పిస్తారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. ఓంకార్:- అధ్యక్షా, జస్టిస్ గోపాలరావు ఎక్బోటెగారి యొక్క మరణం పట్ల ఎవరమైనా సంతాపం ప్రకటించకుండా ఊరుకోలేము. ప్రముఖ జాతీయ వాది, ప్రముఖ న్యాయ శాస్త్ర నిపుణుడు, ప్రముఖ ప్రజాస్వామ్య ఉద్యమ నాయకులు అయిన శ్రీ గోపాలరావు ఎక్బోటెగారి యొక్క మరణం చాలా నష్టకరం, రాష్ట్ర ప్రజలకు ఎంతో విచారకరం. కాబట్టి వారి మరణం పట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తున్నాను.

మునిసిపల్ పరిపాలనా శాఖ మంత్రి (శ్రీ ఎం. నర్సింహారెడ్డి):- అధ్యక్షా, జస్టిస్ గోపాలరావు ఎక్బోటెగారితో నాకు కొంత వ్యక్తిగత సంబంధం ఉంది. నేను కొద్ది కాలం పాటు వారి దగ్గర జూనియర్‌గా కూడా పనిచేశాను. మొదట ఎల్.ఎల్.బి. పాస్ అయిన తరువాత హైకోర్టులో ఒక గొప్ప న్యాయవాదిగా పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. వారు ఈ రాష్ట్రంలోనే ఒక ప్రథమ స్థానం సంపాదించారు. తరువాత వారు భూర్గుల రామకృష్ణా రావుగారి క్యాబినెట్‌లో విద్యాశాఖా మంత్రిగా వున్నారు. సమరసింహారెడ్డిగారు చెప్పినట్లు ల్యాండ్ రెవిన్యూ యాక్టు, టెనెన్సీ యాక్టుల విషయంలో వారు ఎంతో కృషిచేసి, తెలంగాణా ప్రజలకు ఎంతో సేవ చేసినారు. వారు ప్రధాన న్యాయమూర్తిగా, రాష్ట్ర మంత్రివర్యులుగా, సోషల్ రిఫార్మర్‌గా, ఈ రాష్ట్రానికి ఎంతో సేవలు అందించారు. గత సంవత్సరం, ఈ సంవత్సరంలో కూడా వారితోపాటు కొన్ని సమావేశాలలో పాల్గొనడానికి

నాకు అవకాశందొరికింది. తుది వరకు కూడా ఒక జాతీయ నేతగా, జాతీయ సిద్ధాంతాలతో ఉన్నవారు. వారి మరణానికి సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్:— భూర్గుల రామకృష్ణారావుగారి మంత్రివర్గంలో విద్యా మంత్రిగా ఉంటూ, పెద్ద ఎత్తున విద్యా సంస్థలను నెలకొల్పడానికి విశేషంగా కృషి చేసిన వ్యక్తి శ్రీ గోపాలరావు ఎక్బోటే. సామాజిక సేవారంగంలో కూడా కృషి చేసిన విషయం మరువ రానిది. జీవితాంతం సామాజిక విలువల కోసం ఎంతో పాటు పడ్డ వ్యక్తి. వీరు దీర్ఘకాలంగా అస్వస్థులుగా ఉండి, ఈ మధ్యనే 1994 జూన్ 4వ తేదీ శనివారం మరణించారు. వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటిద్దాం.

(సభ శ్రీ గోపాలరావు ఎక్బోటే ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించింది)

## సంతాప ప్రతిపాదనలు

## (8) ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ సభ్యులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి మృతిపట్ల సంతాపము

ముఖ్యమంత్రి (శ్రీ కె. విజయ భాస్కరరెడ్డి).— అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసన సభ్యులు, మాజీ ముఖ్యమంత్రి, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి మరణంపట్ల ఈ సభా ముఖంగా నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు 1946 నుంచి 1952 వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనూ, 1955 నుంచి 1971 వరకూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ్యునిగానూ ఎన్నికయ్యారు. వీరు 1956 నుంచి 1964 వరకు రాష్ట్ర ఆర్థిక మంత్రిగానూ, 1964 నుంచి 1971 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగానూ పనిచేశారు. 1972–73 సంవత్స రంలో ఆరవ ఆర్థిక సంఘ అధ్యక్షులుగా ఉన్నారు. 1974 వ సంవత్సరంలో కొన్నాళ్ళు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిగానూ, 1974 నుంచి 1975 వరకూ కేంద్ర హోం మంత్రిగానూ పనిచేశారు. 1974లో రాజ్యసభ సభ్యునిగానూ, 1975లో లోక్‌సభ సభ్యుని గానూ ఎన్నిక అయ్యారు. వీరు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వున్నారు. వీరు 1980లో చరణ్ సింగ్ ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రిగా కూడా వున్నారు. మహారాష్ట్ర గవర్నరుగా కూడా పనిచేశారు. ఏడు సంవత్సరాల సుదీర్ఘకాలం మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర అభివృద్ధికి వీరు నిర్వహించిన పాత్ర

అమూల్యమైనది, ఎనలేనిది. రాష్ట్ర ఐక్యత కోసం చాలా కృషి చేసి తమ పదవులను కూడా త్యాగం చేసిన ఘనులు వీరు. జీవితాంతం కాంగ్రెస్ వాదిగానే దేశానికి, రాష్ట్రానికి ఎనలేని సేవ చేసారు. 1994 మే 15వ తేదీ శుక్రవారం నిజాం వైద్యశాలలో మరణించారు.

అధ్యక్షా, బ్రహ్మానందరెడ్డిగారు ఈ రాష్ట్రానికి చేసిన సేవల గురించి మనం మరచి పోవడానికి వీలు లేదు. ఏ పదవిలో ఉన్నా, ఆ పదవికి గౌరవం తెచ్చే విధంగా వారు ఆ పదవిని నిర్వహించారు. ఆనాటి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ ప్రకాశం పంతులుగారి ఆశీర్వాదంతో ఒంగోలు జిల్లా బోర్డు అధ్యక్షులు అయి, మద్రాసు రాష్ట్రం నుంచి శాసన సభ్యులై, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయి, కేంద్రంలో హోంమంత్రిగా, కమ్యూనికేషన్స మంత్రిగా, గవర్నరుగా 7వ ఆర్థిక సంఘ అధ్యక్షులుగా ఆయన రాష్ట్రానికి ఆర్థిక స్తోమత కలిగించిన విషయం మరచిపోరాదు. 1955లో కర్నూలు రాజధాని అయిన తరువాత వారు శాసన సభ్యులయ్యారు. అప్పటినుంచి, వారు చనిపోయే దాకా వారితో చాలా సన్నిహిత సంబంధం ఉన్నవాడిని నేను. ఈవాళ రాజకీయంగా నేను ఇంతవరకూ ఎదిగానంటే, ఆయన ప్రభావం నాపై చాలా ఉంది. 1967లో నాకు కాంగ్రెస్ టిక్కట్ రాలేదు. రాకపోయినా, ఆయన ముఖ్యమంత్రి అయిన తరువాత తన ప్రభుత్వంలో సహకార శాఖ మంత్రిగా తీసుకోవడమే కాకుండా, ఆయకట్టు అభివృద్ధి మంత్రిగా, ఆర్థిక మంత్రిగా తన మంత్రివర్గంలోనికి నన్ను తీసుకుని, ఎంతో ప్రోత్సహించి నాకు ఎంతో శక్తిని ఇచ్చారు. అనేక అంశాలలో ఆయన ప్రదర్శించిన తెలివి తేటలు, వ్యవహరించిన పద్ధతులూ చూశాను. జీవితంలో 1969 మాత్రం మరువరానిది. ప్రత్యేక రాష్ట్రం అని రెండు సంస్కృతుల కలయికకు కొంచం ఇబ్బంది వచ్చి విడిపోయే పరిస్థితి వచ్చింది. ఒక పెద్ద ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమంలో ఎన్నో ఒత్తిడులకు లోనయ్యారు. మాకు ఇంకొక ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని దీనిని విడదీయడానికి ఎంతో ప్రయత్నం చేయడం జరిగింది. వాస్తవానికి ఎన్నో ఇబ్బందులు ఉన్నాయి. వారు తమ ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేయాల్సి వచ్చింది. రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి సంతోషంగా తమ పదవిని త్యాగం చేశారు. ఎన్ని నిందలు వచ్చినా ఎంతో నిబ్బరంతో వ్యవహరించేవారు. ఎంత కష్టమైన సమస్యలు వచ్చినా అటువంటి నిబ్బరం ఉన్న నాయకుని చూడడం చాలా అరుదు.

బహుశ చాలా మందికి తెలియదు. భారత దేశంలో హిందీకి వ్యతిరేకంగా దక్షిణ మద్రాసులో ఒక ఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమం చాలా తీవ్రమైన విశ్వరూపం దాల్చింది.
10.00 అప్పుడు లాల్ బహదూర్ శాస్త్రిగారు ప్రధానమంత్రి. భాషాప్రయుక్త ప్రాతిపదికపై ప్రత్యేక
ఉ. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో బ్రహ్మానందరెడ్డిగారి పాత్ర చాలా ముఖ్యమయినది. భాషా ప్రయుక్త రాష్ట్రాల సమస్యను పరిష్కరించడంలో బ్రహ్మానందరెడ్డిగారి సలహాలు లాల్ బహదూర్ శాస్త్రిగారు తీసుకున్నారు. అంతటి మేధావి అయిన వ్యక్తి మనవారు కావడం చాలా గర్వ కారణం. కానీ ఆయన ఒక సంవత్సరం పాటు చాలా బాధపడ్డారు. ఎందుకో మనస్సులో నిస్పృహవచ్చి జీవించాలనే ధైర్యం ఆయనకు పోయింది. ఎంతో ప్రయత్నంచేసి

బొంబాయికి వెళ్ళమన్నా, ఇతర దేశాలకు వెళ్ళమన్నా వేరే డాక్టర్చేత పరీక్షిస్తామన్నా అనవసరం అన్నారు. చనిపోయేముందు చాలాసార్లు వారిని నేను చూశాను. ఆసుపత్రిలో డాక్టర్లు మందు ఇచ్చినా తీసుకునేవారు కాదు. ఆహారాన్ని తినేవారు కాదు. వేరే విధంగా ఇప్పించాలని ప్రయత్నించినా తీసుకునేవారు కాదు. ఆయన ఆఖరి దశలో బాగ హృత్రం మనసుకి బాధకలిగించింది. ఆయన మనో నిబ్బరం, తెలివితేటలు, జాతీయభక్తి మనకు మార్గదర్శకంగా ఉండాలని అనుకుంటూ వారి కుటుంబానికి వ్యక్తిగతంగాను, శాసనసభ తరుఫున, నా సానుభూతిని తెలుపుకుంటున్నాను.

శ్రీ కె. విద్యాధరరావు (చింతలపూడి) :– కీర్తిశేషులు బ్రహ్మానందరెడ్డిగారు అనేక ఉన్నత పదవులు అలంకరించి రాష్ట్రానికి, భారతదేశానికి ఎన్నో విశిష్ట సేవలు చేసిన వ్యక్తి. వారు మంత్రిగా, ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవ మరువరానిది. ఎన్నో శాశ్వత మయిన గుర్తింపు పొందే కార్యక్రమాలు ఈ రాష్ట్రంలో చేసిన వ్యక్తి. అదే విధంగా కేంద్రంలో కూడా హోమ్ శాఖామాత్యులుగా, పరిశ్రమల శాఖామాత్యులుగా, ఆరవ ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్‌గా వారు పదవులు అలంకరించి కేంద్రానికి దేశ ప్రజానీకానికి వారు చేసిన కార్యక్రమాలు మరువరానివి. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదవులు అలంకరించిన వారిలో దాదాపు 7 సంవత్సరాలు ఆ పదవిని అలంకరించిన ఒకే ఒక వ్యక్తి అంటే అది వారి వ్యక్తిత్వాన్ని మించి వేరే కాదని చెప్పవలసిన అవసరముంది. వారు నమ్మిన సిద్ధాంతాలు చెప్పడానికి గాని, లేక నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడి, పదవీ త్యాగం చేయడం కోసం వెనుకాడని వ్యక్తి ఆయన. కానీ ఈ తరుణంలో పదవుల కోసం ఫిరాయింపులు ప్రోత్సహించుకుంటూ వారు నమ్మిన సిద్ధాంతాలతో రాజీపడుతూ పదవులను కాపాడుకుంటున్నారు. కానీ ఆయన ఆ తరుణంలో రాష్ట్ర సమైక్యత కోసం పాటుపడిన వ్యక్తి అనే విషయం మరువరానిది; ఆ విషయం గుర్తుచేసుకోకతప్పదు. అటువంటి నాయకులు ఈ రోజులలో అయిన మన రాష్ట్రంలో ప్రకాశం జిల్లా ఏర్పాటుకు కూడా తోడ్పడిన వ్యక్తి ఆయన అని అందరికీ తెలుసు. అదే విధంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుని పూర్తి చేయడంలో వారు చేసిన కృషి మరువరానిది. వారికి తెలుగుదేశం పార్టీ తరఫున, నా తరఫున వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి. నాగేశ్వరరావు (ఖమ్మం) :– ప్రముఖ జాతీయవాది, నేత, ప్రముఖ, ఈ రాష్ట్రాన్ని దీర్ఘకాలం పరిపాలించిన వ్యక్తి బ్రహ్మానందరెడ్డిగారు ఈ రోజు మన మధ్యలో లేరు. ఈ తరం నాయకులను గుర్తు తెచ్చుకుంటూ ఉంటే, వారు లేరు అనుకుంటే ఎంతో బాధ కలుగుతుంది. ఏదో పోగొట్టుకున్నామనే విషయం అర్థమవుతోంది. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు వారి హయాంలో రెండు ప్రముఖమయిన యాజిటేషన్స్ వచ్చాయి. శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ఫార్ములా ఆనాడు వారి చొరవవల్ల వచ్చిన విషయమని నాకు బాగా గుర్తు ఉంది. అదే విధంగా మన రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని రాష్ట్ర సమైక్యతను దెబ్బకొట్టాలని కొన్ని శక్తులు ఉన్నా, ప్రత్యేక తెలంగాణా కావాలని ఉద్యమం నడిపిననాడు ఎన్నో అపవాదులు

తనమీదా, తన కుటుంబంమీదా వచ్చినా ఎన్నో విచ్ఛిన్నకరశక్తులు దాడిచేసినా ఎంతో ఆత్మ విశ్వాసంతో, మనో నిబ్బరంతో రాష్ట్ర సమైక్యతని కాపాడి చాలా త్యాగాలు చేసిన వ్యక్తి. ఆ విషయాలన్నీ గుర్తు ఉన్నాయి. శ్రీమతి ఇందిరాగాంధీగారు ఆయనను రాజీనామా అడుగగా, అప్పుడు మెజారిటీలేక అని కాదు, రాష్ట్రాన్ని ఏదో నష్టానికి గురిచేశారనే అభిప్రాయంతో కాదు, ఆయన సున్నితమయిన సమస్యను పరిష్కరించడం కోసం పదవి త్యాగంచేయాలని అడిగినప్పుడు ఈ రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన మహోన్నతమయిన వ్యక్తి. అలాంటి వారు కొంతమంది అరుదుగా ఉంటారు. రెండు "టర్మ్స్"లో వరుసగా ఏడేళ్ళకాలం రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగారు. కొంతమంది గొప్పవారికి కూడ కొన్ని సాధ్యం కాకపోవచ్చు, అసలీరోజు ఉన్న రాజకీయాలలో ఇది సాధ్యం కాకపోవచ్చు. ఆ విధంగా మరొకవ్యక్తి రామారావుగారు ఏడేళ్ళకాలం మన రాష్ట్రాన్ని పాలించారన్న విషయం వాస్తవం. ఆనాడు ఆయన ఉన్నత విలువలకోసం తపించిపోయారు. ఆ విషయం నాకు గుర్తు ఉంది. ఆయన రాజకీయాల నుండి రిటైర్ అయినప్పుడు, 1990 సంవత్సరంలో దిగజారుతున్న నైతిక విలువలమీద ఆయన ఆవేదన చెందుతూ, ఆనాడు ఉన్న రాజకీయ పార్టీలకు భిన్నంగా, అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి దృష్టిలోపెట్టుకుని ముందుకు పోవలసిన అవసరం ఉందనీ ఓపెన్ లెటర్, లెజిస్లేటర్స్ అందరికీ, పబ్లిక్‌రంగంలో ఉన్న ప్రతీవారికీ ఆయన అడ్రస్ చేసిన సంగతి నాకు గుర్తు ఉంది. ఒక ఏబుల్ అడ్మినిస్ట్రేటర్‌గా, ఫైనాన్స్ మినిస్టరుగా ఆయన ఉన్నారు. అదృష్టవశాత్తు నాకు ఆనాడు ఆయనను కలుసుకునే అవకాశం కలిగింది. అప్పుడు నేను ఆల్ ఇండియా స్టేట్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. అప్పుడు విద్యార్థులకు కొద్దిపాటి ట్యూషన్ ఫీజులు మాత్రమే ఉండేవి ఆ రోజులు ఇప్పటిలాగా వాగ్దానాలిచ్చే రోజులు కావు. ఆ విషయాలన్నీ చాలా ఓపికతో విద్యార్థి నాయకులతో చర్చించి సమస్యను పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేసిన వ్యక్తి, మంచి పరిపాలనాదక్షుడు, జాతీయవాది. అటువంటి స్వాతంత్ర్య సమరయోధుడిని కోల్పోవడంపట్ల రాష్ట్ర ప్రజలంతా దిగ్భ్రాంతిచెందారు. వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తపరుస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, ఈ రాష్ట్రానికి ఏర్పడిన లోటును అందరమూ కలిసి కాంగ్రెస్‌పార్టీ నాయకుడయినా, కేంద్ర మంత్రి అయినా, గవర్నర్ అయినా కూడా అవన్నీ కాకుండా రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆయన చేసిన త్యాగాలను మననం చేసుకుంటూ ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్ళడంలో వారి అనుభవాలు తప్పక ఉపయోగపడతాయనే అభిప్రాయంతో మరొక్కసారి వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని మా పార్టీ తరఫున వ్యక్తపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

10:10 ఉ. శ్రీ బి. వెంకటేశ్వరరావు (మధిర) :- అధ్యక్షా, ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, జాతీయ నాయకుడు, రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో అనేక బాధ్యతాయుతమైన పదవులను నిర్వహించి ఈ రాష్ట్రానికి ఎనలేని సేవ చేసినటువంటి మాజీ ముఖ్యమంత్రి కీ.శే. శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మృతికి సంతాప సూచకంగా ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను. రాష్ట్ర ప్రయోజనములను కాపాడడంలో ఏ రకమైన

త్యాగాలు ఆయన చేశారో ఇంతకు ముందు అందరూ చెప్పారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నేను శాసన సభ్యుణ్ని కాను. కానీ, అనేక సందర్భాలలో నాకు పరిచయం ఉండి ఆయనను కలుసుకోవడం జరిగింది. నేను "రైసీ సంఘం" కార్యదర్శిగా ఉన్నప్పుడు అనేక తీవ్రమైన సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్ళినప్పుడు ఎంతో సహసం ప్రదర్శించి ఆ సమస్యలకు పరిష్కారమార్గాన్ని చూపేవారు. అంతేకాక 1969 మే, నెలలో తుఫాను వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టము జరిగినది, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని 'మధిర' నియోజకవర్గంలో 60, 70 మంది మృతి చెందారు, పైగా అనేక గ్రామాలు కొట్టుకొని పోయాయి. పునరావాస కార్యక్రమములను పర్యవేక్షించవలసినది. సి.పి.ఐ. పార్టీ తరఫున శ్రీ ఎన్. గిరిప్రసాద్‌గారు, మా పార్టీ తరఫున మేము వెళ్ళి ముఖ్యమంత్రిగారిని కోరగా ఆయన పిచ్చేశారు, ఆ సందర్భంలో ఆయన సమక్షంలో మాకు అధికారులకు కొంత గొడవ జరగగా దానిని ఆయన ఛాలెంజ్‌గా తీసుకొని పునర్నిర్మాణ కార్యక్రమములలో ఆయన చూపిన చొరవ, పరిష్కారం చేసిన తీరు మమ్ములను ఎంతో ముగ్ధులను చేసినది. దీనిని బట్టి సమస్యా పరిష్కారం పట్ల ఆయన ఎంత పట్టుదలతో ఉండే వారో అర్థమౌతుంది. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం, రాష్ట్ర సమైక్యత పరిరక్షించ డానికి చేసిన ప్రయత్నాల గురించి నా కంటే ముందు మాట్లాడిన వారు విన్నవించారు. ఎన్నో త్యాగాలు చేసిన వ్యక్తి ఆయన. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు ఆయన తొణకక, బెణకక, కష్టములో కానీ, సుఖములో కానీ సంయమనం వహించారు. రాష్ట్ర ప్రయోజనా లను బలి పెడుతున్నారని ఆయనపై వచ్చిన నిందారోపణలను, అనేక ఘటనలను ఆయన దిగమింగి నిబ్బరంగా వ్యవహరించి సమస్యలను పరిష్కారం చేయడంలోనూ, ఎదుర్కోవడం లోనూ ఆయన హుందాతనము ప్రదర్శించే వారు. ఆయన ప్రసంగించేటప్పుడు సున్నితమైన హాస్యాన్ని మేళవించి చతురోక్తులు చెప్పేవారు. ఆయన చిరునవ్వుతో సమస్యలను పరిష్క రించిన ప్రముఖుడు. అనేక ఉద్యమాలు జరిగినప్పుడు రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టకుండా నిలబడిన వ్యక్తి ఆయన. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకే కాకుండా దేశానికి, రాష్ట్రానికి తీరని లోటు. ఆయన మృతి పట్ల మా పార్టీ తరఫున వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపము తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎన్. జనార్దనరెడ్డి (వెంకటగిరి):- అధ్యక్షా, ఒక వ్యక్తి మరణించినది అందులోనూ వయస్సు ముదిరి, పండి మరణించినప్పుడు కూడా ఆ వ్యక్తి యొక్క మరణం తీరని లోటు సృష్టిస్తుంది, అటువంటి వ్యక్తే శ్రీ బ్రహ్మానందరెడ్డి. ముప్పై సంవత్సరాల పార్లమెంటు జీవితమును ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా సాగించి, భారత దేశంలో జరిగిన అనేకమైన రాజకీయ పరిణామాలలో తనదంటూ ఒక హస్తం ఉందని చూపించి ఒక లెజండర్ ఫిగర్ అయినాడు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు. ఆంధ్ర దేశములో ఆయన ఒక ఎన్‌సైక్లోపిడియా. మనుషుల గురించి అంచనా వేయడంలో ఆయనకు ఆయనే సాటి. చిన్న వాడినైన నాకు ఆయన చక్కని సలహాలు ఇచ్చి పంపించిన వ్యక్తి. నాకు బాగా జ్ఞాపకం 1972 వ సంవత్సరంలో శ్రీ పి.వి. నరసింహారావుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను

రాజ్యసభకు పోటీ చేశాను, అప్పుడు శ్రీ పి వి. నరసింహారావుగారు 44 మంది ఓటర్సని నాకు ఇవ్వడం జరిగింది, అప్పుడు నేను నేరుగా బ్రహ్మానందరెడ్డిగారి వద్దకు వెళ్ళి లిస్టు చూపి అభిప్రాయం అడుగగా ఆయన రెండు పేర్లను నొక్కి ఈ రెంటి విషయంలో జాగ్రత్తగా ఉండమని అన్నారు. ఆ రెండు పేర్లను నేను పెన్‌తో నోట్ చేసుకోబోగా ఎప్పుడు ఇటువంటి పని చేయకు అని చెప్పారు, ఆ రెండు ఓట్లు పోయినాయి నాకు, అంత చక్కటి అసెస్‌మెంట్ ఇవ్వగలిగిన వ్యక్తి ఆయన. సంయమనం ఆయన సొత్తు. ఆయన సంయమనమే ఈ రాష్ట్రాన్ని కాపాడింది. ఆయన తొందరపాటు వల్ల కానీ, మూర్ఖత్వం వల్ల కానీ, కులతత్వం వల్ల కానీ ఆయన జీవిత చరిత్రలో తీసుకొన్న నిర్ణయాలు ఈ పొరపాటు వల్ల ఈ పొరపాటు జరిగింది అని ఎక్కడా చెప్పలేము. ఆయన చక్కని అడ్వయిజ్ ఇచ్చే వాడు. ఇంత వరకు ఎవరికీ తెలియని ఒక సత్యాన్ని చెపుతున్నాను. ఈ సభలో సభ్యునిగా ఉన్న శ్రీ సుధీర్ కుమార్‌ని నక్సలైట్స్ అపహరించుకుపోయారు. ఎన్నికల సమయం అది. రాష్ట్రంలో నక్సలైట్ల కిడ్నాపింగ్‌లు ఎక్కువైనవి నక్సలైట్లు 'నిమ్మలూరు భాస్కరరావుని' వదిలితే శ్రీ సుధీర్‌కుమార్‌ని వదులుతామని ఒక సందేశం పంపించారు, ఏమి చేయాలో నాకు తోచలేదు, ఆనాడు ప్రభుత్వం ఎక్స్‌ట్రిమిస్టులపై కఠినమైన చర్యలు తీసుకొంది. నేను సుధీర్ కుమార్ ఇంటికి వెళితే ఆయన భార్య కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆయన తండ్రి నా ఇంటికి వచ్చి కూర్చొని నిశ్చేష్టుడై ఉన్నాడు, ఆ తండ్రి బాధను గమనించ గలిగాము. ఏమైనా సరే, ఒక ప్రత్యేకమైన ఎలక్షన్‌లో నిర్ణయం తీసుకొంటున్నామని నిమ్మలూరు భాస్కరరావుని వదిలి పెట్టడానికి నిర్ణయం తీసుకొన్నాను. ఆ రోజు రాత్రి శ్రీ రాజీవ్ గాంధీ బొంబాయి నుండి వచ్చారు, రాగానే నన్ను రూంలోనికి తీసుకువెళ్ళి said like this. 'How can you take a decision like this? Mufti Mohammad Sayeed, Home Minister in V.P. Singh's Government has released five militants for his daughter's sake. I opposed it. 'I criticised it. We took a stand.' ఏమి జవాబు చెప్పాలి ప్రజలకు, ఏమి జవాబు చెప్పాలి పార్లమెంటుకి అని ఆయన ప్రశ్నించారు, నీవు ఎందుకు చేశావు ఈపని అని అన్నారు.

10-20 ఉ. దానికి నేను ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఇది చేయవలసి వచ్చింది. పార్లమెంట్ ఎలక్షన్స్‌లో మేము, ఎంబ్రాసిమెంట్ కలిగించానని ఎవరికైనా అనిపిస్తే, ఇప్పుడు రాజీనామా యిస్తానని అంటే Then he said "Resignations would not solve the problem" అని వారన్నారు. "In the given circumstances what the Chief Minister has done is the right thing". He is such an Adviser. అని తరువాత నాకు కూడా చెప్పారు. అది ఒక్కటే ఆయనను శాంతింపచేసి ఆయన సమస్యను పరిష్కారం చేయగలిగినది. అతను చక్కటి సలహాదారు. ఆయన ఎన్నో బాధలు పడ్డారు. ఆంధ్ర యాజిటేషన్ తరువాత పి.వి. నరసింహారావుగారు ముఖ్యమంత్రిగా ఈ సభలో నిలబడి, "నాకు యిప్పుడు తెలుస్తున్నది. ఆ వ్యక్తి ఎన్ని బాధలుపడ్డారు అన్నది". ఆ వ్యక్తి అంటే శ్రీ బ్రహ్మానందరెడ్డి గూర్చి. ఆయన గూర్చి కన్నీళ్ళు కూడా కార్చారు. శ్రీ బ్రహ్మానంద రెడ్డి ఎన్నో ఇబ్బందులకు, అవమానాలకు గురి అయ్యారని, పి.వి. నరసింహారావుగారు

తల్చుకుని కన్నీళ్ళు పెట్టారు. ఈ రాష్ట్రంలో ఆయన ఒక లెజండ్రీ ఫిగర్. అడాప్టబిలిటీ ఆయనకు ఉన్నంత మరొకరికిలేదు. ఈ రోజు ఆయన ముఖ్యమంత్రి కాకపోయినా, నాగేశ్వరరావుగారు చెప్పినట్లు పాతతరం వారు ఆయన. ఆయన పాతతరమే కాదు, కొత్తతరంలో కూడా పని చేయగలిగిన వ్యక్తి. ఆరోజులలోనే 35 లక్షల ఎకరాల బంజరు భూమిని పంచిపెట్టి చరిత్రను సృష్టించారు. హౌసింగ్ ప్రోగ్రాముసు ఇన్యూరెన్స్ ద్వారా భారత దేశంలో తీసుకువచ్చిన ముఖ్యమంత్రి ఆయన. సర్వే చేయించి, ప్రత్యేకంగా తెలంగాణా, ఆంధ్రాలు ఒకటైన తరువాత, సర్వే రూల్స్, రెవిన్యూ రూల్స్ సమైక్యం చేయాలనే, తెలంగాణాలో వున్నటువంటి బాధలన్నింటికీ కారణం ప్రాపర్ సర్వే లేకపోవడమేననీ తలచి సర్వే మొదలు పెట్టించారు. పాస్ బుక్స్ అనే పద్ధతి రైతులకు యివ్వాలన్నది ఆయన మేధస్సులోని మాటే. ఇటువంటి ప్రోగ్రెసివ్ యాక్టివిటీస్ ఆ రోజులలోనే ఆయన సాగించారు. ఎన్నో సాధించారు. వాటిని గూర్చి నేను ప్రత్యేకంగా తెలుపవలసిన అవసరం లేదు. ఈ రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మేజర్ ప్రాజెక్టులన్నీ వున్నాయంటే కారణం శ్రీ బ్రహ్మానందరెడ్డిగారే. నేను పి.సి.'ప్రెసిడెంటుగా వున్నప్పుడు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం లేదు. మరొక ప్రభుత్వం వుంది. నేను పి.సి.సి. ప్రెసిడెంటుగా అవగానే ఇంద్రజిత్‌గుప్తా నా దగ్గరకు వచ్చి మీరు, శ్రీ చంద్ర రాజేశ్వరరావును కలవమన్నారు. ఆయనప్పుడు సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి (ఢిల్లీలో వుండేవారు) నేను వెళ్లి వారిని కలిశాను. అప్పుడు ఆయన్నారు. "నీవు, నేను, ఆంధ్రులము. ఎన్. సంజీవరెడ్డి, సంజీవయ్య, బ్రహ్మానంద రెడ్డి అందరూ పరిపాలన చేశారు. కానీ ఎందుకో ఈ రోజుల్లో ప్రజలలో కులతత్వం పెరుగుతున్నది. ఇది ఆంధ్ర రాష్ట్రానికి చాలా ప్రమాదకరం. కనుక మీరు నేనూ కలిసి దీని నిర్మూలనకు కృషి చేయాలి. కనుక ఈ విషయంలో శ్రీ బ్రహ్మానందరెడ్డి సలహాను తీసుకో" అన్నారు. అప్పుడు నేను అడ్మినిస్ట్రేషనులో లేను. కానీ వున్న వాతావరణాన్ని బట్టి ఆయన కూడా అంటే ఒక కమ్యూనిస్టు మేధావి కూడా బ్రహ్మానందరెడ్డి సలహాను తీసుకోమన్నారు. అంటే ఆయన అందరి మనస్సులను ఆకట్టుకున్నవారని తెలుస్తోంది. ఆయన ఒక మేధావి వర్గానికి చెందిన వ్యక్తిగా జీవించారు, మరణించాక కూడా వారు మన హృదయాలలో చిరస్మరణీయ స్థానాన్ని పొందగలిగారు. పార్టీ రాజకీయాలకతీతమైనారు. అందుకని నేనొక చిన్న మనవిచేస్తున్నాను. నాయకుడిగా, ముఖ్యమంత్రిగా ఇన్ని సంవత్సరాల రాజకీయ జీవితం అనుభవించి, పదవులు పొంది, సేవచేసి, చాతుర్యంతో, స్వశక్తితో ఎన్నో కష్టాలను అధిగమించిన వ్యక్తి మరొకరు లేరు. అందుకనే పార్లమెంటులో మౌలాంకర్ స్పీకర్, ఆయన అధ్యయనం చేసి ఒక పుస్తకం ప్రచురించారు. అలాగే ఈ సభలో ఎవరైనా ఆయనను అర్థం చేసుకున్న వ్యక్తిగా, రీసర్చ్ మైండు వున్న వారు ఎవరైనా ఆయన ఉపన్యాసాలనూ, ఆయన చేసిన కార్యక్రమాలనూ, ఆయనకు యితరత్రా జరిగిన సంఘటనలను ఒక్క అసెంబ్లీవే కాకుండా ఇతరమైనవి కూడా క్రోడీకరించి ఒక చక్కటి వాల్యూమ్‌ను ఈ అసెంబ్లీ వారు ప్రకటిస్తే బాగుంటుంది. మన తెలుగు యూనివర్శిటీలో 20 లక్షల రూపాయలు పెట్టి మనం చాలా మంది పెద్దల భావాలను రికార్డు చేయించాము. వాటినీ కూడా చూసి ఈ వాల్యూం ప్రచురిస్తే భావితరాల వారికి ప్రయోజనకారిగా వుంటుంది.

విగ్రహాల ప్రతిష్ఠాపనలు చేస్తున్నారు. అవి పెడుతూ వుంటారు. కొడుతూ వుంటారు. కానీ ఈ పని చేస్తే బాగుంటుంది. తమరూ, ముఖ్యమంత్రిగారూ ఈ విషయమై ఆలోచించవలసిందిగా కోరుతూ, నా హృదయపూర్వక నివాళులు వారికి అర్పిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉపముఖ్యమంత్రి (శ్రీ కె. రంగారావు):- అధ్యక్షా, పూజ్యులు బ్రహ్మానందరెడ్డిగారు నాకు ప్రజాప్రతినిధిగా పరిచయం లేక పోయినా, ఒక కార్యకర్తగా ఆనాటి కృష్ణాజిల్లా నాయకులు, కాకాని వెంకటరత్నంగారి ద్వారా నేను వారిని కలిశాను. శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు ఎంతో ఉన్నతమైన, ఉదాత్తమైన రాజకీయ నాయకులు. తన పరిపాలనలో ఆయన నైతిక విలువలను జోడించి రాష్ట్రానికి, దేశానికి ఆదర్శవంతమైన పరిపాలనను అందించారు. పెద్దలు చెప్పినట్లు కష్టాలు అవమానాలూ, బాధలూ వచ్చినప్పటికీ కూడా ఆయన రాష్ట్ర సమైక్యతను, ప్రజా సంక్షేమాన్ని ధ్యేయంగా పెట్టుకుని తుదకు ఆయన తన పదవిని త్యజించడానికి అయినా వెనుకాడని వ్యక్తి. ఆయన చాలా శాంతమూర్తి. ఎంతో ఉన్నతమైన ఆలోచనలు కల నాయకుడు. ఈ రాష్ట్రానికీ, దేశానికీ ఆయన చేసిన సేవ చాలా వున్నతమైంది. ఈ రాష్ట్రం వ్యవసాయకంగా, విద్యాపరంగా పైకి వచ్చింది అంటే ఆయన చేసిన కృషే కారణం. భవిష్యత్తులో ఆయన చేసిన ఈ సేవలను గుర్తుంచుకుని, ఆయన జీవిత ధ్యేయాన్ని గుర్తించి ప్రతి రాజకీయనాయకుడు, కార్యకర్త కూడా ఆయన అడుగు జాడలో నడవాలి. ఆయన వంటి వ్యక్తి రాజకీయ నాయకుడు మరొకరు లేరనీ చెపుతూ, ఆయన మరణానికి నేను విచారాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఆర్థిక మంత్రి (శ్రీ కె. రోశయ్య):- అధ్యక్షా, పూజ్యులు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారి గూర్చి ఈ సభలో వున్నటువంటి వారికి చాలామందికి సన్నిహిత వ్యక్తిగా పరిచయాలు వున్నాయి. వారందరు చెప్పిన మాటలతో నేను ఏకీభవిస్తున్నాను. ఆయన గొప్ప పరిపాలనాదక్షుడు ఏవో కొన్ని సందర్భాలలో విభేదించిన వారున్నా ఆయన పరిపాలనా దక్షుడని ప్రతి రాజకీయ నాయకుడూ అంగీకరించారు. 'ఏ జిల్లాలో ఎవరిని అడ్మినిస్ట్రేషన్‌లో పెట్టాలన్న విషయంలో ఆయన అన్ని విషయాలనూ ఎన్నో కోణాలనుంచీ ఆలోచించి నిర్ణయాలు తీసుకునేవారు. ఆయన తొట్రుపాటు లేకుండా నిర్ణయాలు తీసుకుంటారు. ఏ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర ప్రయోజనానికి ప్రాధాన్యతనిచ్చేవారు. ఆ విషయం మనందరకూ తెలుసు. నాకు ఒక విషయం గుర్తు వస్తున్నది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రారంభం కావస్తున్న తరుణంలో క్రస్టుగేట్లు పెట్టడానికి ఆలోచిస్తున్నప్పుడు వాటిని శ్రీ బ్రహ్మానందరెడ్డి పెట్టారు. వాటిని గూర్చి ప్రత్యేకంగా పైన రాష్ట్రాల వారు గగ్గోలు పడి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ వద్దకు రాయబారాలు వెళ్ళి ఫిర్యాదులు చేశారు. అప్పుడు శ్రీమతి ఇందిరాగాంధీ శ్రీ బ్రహ్మానందరెడ్డిని పిలిచి 'ఏమిటీ క్రస్టు గేట్లు పెడుతున్నావటని' అడిగారు. అప్పుడు ఆయన అలాంటిది ఏమీ లేదంటూనే తరువాత క్రస్టు గేట్లు ఏర్పాటు చేసిన కారణంగానే ఈవాళ మనం సాగర్ జలాశయంలో నీటిని చాలా హెచ్చుగా వాడుతున్నాము. ఆయన ఏదైనా ఒక నిర్ణయం తీసుకున్నారంటే అది తన వ్యక్తిగత ప్రయోజనానికి కాదు. నాయకురాలికి లేదనీ చెపుతూ పని పూర్తి చేయడం రాష్ట్ర ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే

వేయడం జరిగింది. ఆయన గొప్ప పరిపాలనాదక్షుడు. మంచి సలహాలను యిచ్చేవారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేసేవారు. వారి మరణం ఈ రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా పెద్ద వెలితి. ఆయన రాజకీయ సమైక్యతాయోధుడు. గుంటూరు జిల్లాలో ఆయన జన్మించారు. గుంటూరు జిల్లా ఎప్పుడు కూడా వారిని గుర్తు పెట్టుకుని ఉంటుంది. 10:30
అలాగే ఈ రాష్ట్రం కూడా వారిని గుర్తుపెట్టుకొని ఉంటుంది. వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢమైనటువంటి సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు (మెట్‌పల్లి) :- అధ్యక్షా, కీర్తిశేషులు కాసు బ్రహ్మానందరెడ్డిగారి యొక్క కంచు కంఠాన్ని ఇంగ్లీషు, తెలుగు భాషలలో వారు అనర్గళంగా చేసినటువంటి ప్రసంగాలు, అదే విధంగా పరిపాలనా దక్షతలో ఈ రాష్ట్రంలోనే కాకుండా ఈ దేశంలో ఈ గొప్ప వ్యక్తిగా పేరుతెచ్చుకొన్నారు; మా నాయకులతో శాసన సభలో కాని రాజకీయంగా కాని వారితో కలిసే అవకాశం లేకపోయినా తెలంగాణా ఉద్యమంలో ఎన్నోసార్లు స్టూడెంట్స్ డెలిగేషనులో వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలిసిన సందర్భాలు ఎన్నో వున్నాయి; వారు ఎన్నో గంటలు తరబడి వారు ఛాంబరులో కూర్చొనేవారు; మేము ఆశ్చర్యకరంగా చెప్పుకొనేవారం. రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్రిక్త పరిస్థితి గురించి ముఖ్యంగా జంటనగరాలలో ఉన్నటువంటి సంఘటనలు గురించి అత్యవసరంగా తీసుకోవలసిన చర్యల గురించి అధికారులకు ఆదేశించేవారు. ఎప్పుడు పుస్తకాలు చదివేవారు. పుస్తకాలలో ఉన్నటువంటి ప్రధానమైనటువంటి అంశాలను 15, 20 నిమిషాలు చూచి చదివించేవారు. ఎంత గడ్డు పరిస్థితులలో కూడా చాలా నిశ్చలంగా, నిర్మలంగా ఆయన చాంబరులో కూర్చుండేవారు. అంతేకాకుండా ఎవరు ఏమి అనుకొన్నా రాష్ట్ర సమైక్యత గురించి గట్టి స్టాండు తీసుకొనకపోతె ఈ రాష్ట్రం సమైక్యంగా ఉండేది కాదు అని అభిప్రాయం ఉన్నది. కాసు బ్రహ్మానందరెడ్డిగారి పేరున జంట నగరాలలో ఎన్నో గోడల మీద రాతలు చూచినాము, చాలా అసభ్యకరంగా వారి గురించి, వారి శ్రీమతి గురించి వ్రాసినారు. ముఖ్యమంత్రిగా రాతలు చెరిపించే అవకాశం ఉన్నప్పటికి కూడా రోజులు తరబడి, నెలలు తరబడి సంవత్సరాలు తరబడి ఆ రాతలు అవిధంగానే ఉండేవి. ఏది ఏమైనా ఖచ్చితంగా రాష్ట్ర సమైక్యత కోసం పాటుపడడం అటువంటి ఆయన దీక్షను మరువలేము. సంవత్సరం క్రితం ఒక పారిశ్రామిక వేత్త కె.వి.కె. రాజుగారు చనిపోతే వారి సంస్మరణ సభలో వారు ఇంగ్లీషులో చేసినటువంటి ఆలోచనాత్మక ప్రసంగాన్ని సభలో ఉన్నటువంటి అందరిని ఆకట్టుకొన్నది. అప్పుడు ముఖ్య మంత్రిగారు కూడా ఉన్నారు. వారి చివరి దశలో చేసినటువంటి ప్రసంగాలు, ప్రెస్ కాన్ఫరెన్సులు కాని, దిగజారుతున్నటువంటి రాజకీయ ప్రమాణాలు గురించి వారు నొక్కి చెప్పడాన్ని అన్ని రాజకీయ పార్టీలు గ్రహించాల్సిన అవసరం వుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించినటువంటి తీర్మానానికి నేను మద్దతు తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు మా పార్టీ తరఫున సంతాపాన్ని తెలుపుతూ సెలవు తీసుకొంటున్నాను.

شری ابراہیم بن عبداللہ مسقطی (یاقوت پورہ) :۔ جناب اسپیکر صاحب آج جو بھی ......

مسٹر اسپیکر :۔ اس سیشن کو ۱۲ بجے ختم کرنا ہے۔

شری ابراہیم بن عبداللہ مسقطی :۔ جناب اسپیکر صاحب لوگ دنیا میں آتے ہیں جاتے ہیں جو لوگ اچھا اعمال کرکے جاتے ہیں انکے اعمال باقی رہ جاتے ہیں بسشر برہما نند ا ریڈی صاحب کے چیف منسٹری کے زمانے میں وہ اچھے کام کئے تھے۔ ان کے پاس کسی قسم کی کوئی فیلنگ نہیں تھی۔ ان کے پاس ہندو نا مسلمان ہر ایک کے ساتھ انکا رویہ بہت ہی اچھا تھا۔ وہ مسلمانوں کے دوست تھے اقلیتوں کے دوست تھے۔ ہم کو جب کبھی بھی ان سے ملنے کی ضرورت ہوتی تھی ہم ان سے ملنے کیلئے جاتے تھے وہ ہمارے مسائل کو حل کرنے کیلئے تیار رہتے تھے۔ ان کی گرفت آفیسرس پر بہت ہی اچھی رہتی تھی۔ آج کل ویسی بات نہیں۔ ان کی گرفت بہت ہی مضبوط رہتی تھی کوئی آفیسر سر اٹھا نہیں سکتا تھا۔ ان کے چیف منسٹر کے زمانے میں جیسے تلنگانہ ایجیٹیشن چلا تھا۔ ہر طرف آگ لگی ہوئی تھی۔ ہر جگہ دھواں بھی ہوئی تھی۔ ان کے حکومت چلانے کا انداز بہت ہی اچھا تھا۔ ہر پولیس اسٹیشن کے اندر مسلمانوں اور ہندوؤں کو برابر رکھتے تھے۔ ہر پولیس اسٹیشن میں کنٹرول کرنے کیلئے ہندو اور مسلمان پولیس آفیسرس کو رکھتے تھے تاکہ کنٹرول کرنے میں آسانی ہو۔ حیدرآباد میں آج بھی ان کو یاد کرتے ہیں۔ وہ کس انداز میں حکومت چلاتے تھے آج ویسا نہیں ہے۔ گزرے ہوئے واقعات کو ہم لوگ یاد کر رہے ہیں۔ سب اپوزیشن لیڈرس انکو خدمات کی تائید کر رہے ہیں۔ ہم بھی انکے خدمات کی تائید کرتے ہیں۔ ان کے افراد خاندان کے غم میں ہم اور ہماری پارٹی بھی برابر کے شریک ہیں۔ ہمارے اوپر ان کے بہت سارے احسانات ہیں۔ ان کے پاس کسی قسم کی بھی فیلنگ نہیں تھی۔ وہ ہمیشہ ہماری تائید کرتے تھے۔ ہر آدمی دنیا میں آتا ہے جاتا ہے ہر کسی بھی ایک دن جانا ہے ہمیں چاہئے کہ اچھے کام کریں تاکہ آئندہ زمانے میں لوگ ہمیں یاد کریں۔ ابھی منسٹر جناب جنا ردھن ریڈی صاحب اور سارے اپوزیشن لیڈرس نے ان کی خدمات کی تائید کی ہے۔ ہمیں بھی اچھے عمل کرنے کی ضرورت ہے۔ حکومت چلانے کیلئے ان کے بتائے ہوئے اصولوں پر عمل کرنا چاہئے۔ یقیناً ہمیں ان کی خدمات کا اعتراف کرنا چاہئے میں اور ہماری پارٹی کی جانب سے ان کے انتقال پر ان کے افراد خاندان کے غم میں برابر کے شریک ہیں۔

శ్రీ [illegible] (కరీంనగర్) – అధ్యక్షా, కాసు బ్రహ్మానందరెడ్డి గారు నిండు జీవితం గడిపిన తరువాత మృతి చెందినప్పటికీ స్మృతి పథంలో ఆయనతో ఉన్నటువంటి అసోసియేషన్ జ్ఞాపకం చేసుకుంటున్నాను. మొట్టమొదటి సారిగా 1972లో ఎం.ఎల్.ఏ గా నేను ఎన్నికైనప్పుడు వారి దగ్గరకు [illegible] ఇంటికి వెళితే పాలిటిక్స్ పట్ల సందేశం విషయంగా కమిట్‌మెంట్ ఉండాలి, డైరెక్షన్ ఉండాలి, సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి, పదవులు ముఖ్యం కాదు నాయనా "This is my advice to you" అని ఆయన చెప్పారు. ఆంధ్ర దేశాన్ని పాలించేటటువంటి వ్యక్తులు [illegible] దేశం యావత్తు ఆయనను 'Man of Wisdom'. అని ఎన్నో రకాలుగా ప్రశంసించారు. లోకసభలో మాట్లాడినా లేక లక్షలాది జనంతో మాట్లాడినా వారు చెప్పినటువంటి విషయాలు చాలా శ్రద్ధగా చక్కగా వినేటటువంటి వారు. ఆయన నిరాడంబరవేత్త కాకుండా మంచి సంస్కారవేత్త "Man of a great wisdom,

intellect and cultured polished man" పర్సనాలిటీ నాలెడ్జి ఉండేది వారికి. వారితో మాట్లాడినపుడు చాలా ఇష్టమైన ఇన్‌స్పిరేషన్‌తో భావించేవాడిని నేను. నాకు ఇష్టమైన నాయకులలో బ్రహ్మానందరెడ్డిగారు ఒకరు. వారు మహానాయకులు. ఆంధ్ర రాష్ట్రానికి సేవ చేశారని చెప్పుకొన్నా ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్‌గా ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చి నటువంటి నిధులు ద్వారానే ఒక 5, 6 సంవత్సరాలుగా ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉందనే మాట ఈ సందర్భంగా నేను చెబుతున్నాను. వారు చేసినటువంటి సేవలు రాష్ట్రానికి ముఖ్యంగా తెలంగాణా యాజిటేషన్ గురించి చాలా మంది చెప్పినారు. చేసిన తప్పును ఒప్పుకొనే సహనం చాలా మందికి ఉండదు. కాని నా పీరియడ్‌లో ఒకవేళ తెలంగాణా నిధులు డైవర్ట్ విషయమై నిర్ధారించే కొరకు వారి అంతట వారే ఒక కమీషను అపాయింట్ చేశారు. కమీషన్ అపాయింట్‌మెంట్ వేయడమే కాకుండా నిధుల దుర్వినియోగం గురించి వారు ఒప్పుకొని దాదాపు 60 కోట్ల రూపాయలు నిధులు వారు మళ్ళీ తిరిగి తెలంగాణాకు వాపస్ ఇచ్చేటటు వంటి ధైర్యంచూపి సాహసించిన వ్యక్తి వారు. ఈరోజు దేశం ఎంతో ప్రజ్ఞావంతుడైన వ్యక్తి, ఎంతో ధీశాలుడు అయినటువంటి ఒక మహానాయకుడిని కోల్పోయింది. ఆంధ్ర రాష్ట్రానికే కాకుండా భారతదేశానికి పెద్ద నష్టం అని నేను భావిస్తున్నాను. వారికి ఆత్మ శాంతిని కలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాను.

శ్రీ నాదెండ్ల భాస్కరరావు (తెనాలి) :- అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ కాసు బ్రహ్మానంద 10.40
రెడ్డిగారి గురించి ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానంతో, చెప్పిన మాటలతో, సోదర శాసనసభ్యులు చెప్పిన మాటలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు చేసిన కొన్ని ముఖ్యమైన విషయాలు మిత్రులు శాసనసభ దృష్టికి తీసుకొని రాలేదు. అవి నేను మీ దృష్టికి తీసుకొని వస్తాను. సికింద్రాబాదులో సౌత్ సెంట్రల్ రైల్వే రావడానికి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారే కారకులు. ఆ విషయం మన ముఖ్యమంత్రిగారికి కూడా తెలుసు. అలాగే విశాఖపట్నంలో స్టీల్ ప్లాంటు రావడానికి కూడా వారే కారకులు. ఇలాగ ఆయన చేసిన పనులు చెబితే చాలా టైము పడుతుంది. మీరు కొద్ది వ్యవధి మాత్రమే ఉందని చెబుతున్నారు. ఏది ఏమైనా వారు చేసిన సేవలు చాలా ప్రశంసనీయమైనవి. రాష్ట్రంలో ఎన్నో తరాలవారు గుర్తుంచుకునే విషయాలుగా మనం పరిగణించవలసిన అవసరం ఉంటుందని మనవిచేస్తున్నాను. శ్రీ బ్రహ్మానందరెడ్డిగారితో ఆఖరి మీటింగు గుంటూరులో జరిగింది. అక్కడ వారికి సన్మానం జరిగినపుడు ముఖ్యమంత్రిగారు, నేను అదే డయాస్ మీద ఉన్నాము. ఇంకా కొంతమంది పెద్దలు కూడా ఉన్నారు. తెనాలిలో నా శాసనసభ నియోజకవర్గంలో జరిగిన పబ్లిక్ మీటింగును ఆయన ప్రిసైడ్ చేసారు. 85 సంవత్సరాల వయసులో ఇంత చక్కగా ఇంత దూర ప్రాంతానికి వచ్చి ఇలాగ మీటింగ్సులో పార్టిసిపేట్ చేస్తున్నారని మేమంతా ఆశ్చర్యపోయాము. అటువంటి వ్యక్తి నిండు జీవితాన్ని గడిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేయడమే కాకుండా వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. వారు చేసిన విషయాలను మనం పుస్తక రూపంలో

పెట్టాలని ఇప్పుడే మిత్రులు శ్రీ జనార్ధనరెడ్డిగారు చెప్పినప్పుడు నేను చాలా ఆనందపడ్డానని మనవిచేస్తున్నాను. వారి ఉపన్యాసాలు అన్నీ మన లైబ్రరీలో పెట్టడం చాలా అవసరమనే దానితో నేను ఏకీభవిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

అబ్కారి శాఖ మంత్రి (శ్రీ గాదె వెంకటరెడ్డి):- అధ్యక్షా, కీర్తిశేషులు, పూజ్యులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారి మరణ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ వారు నా జీవితంలో చాలా మరువలేని విషయాలు కూడా చేశారని మనవిచేస్తున్నాను. నేను 1959-60 లో గ్రూప్-1 సర్వీసెస్‌లో సెలక్టు అయ్యాను. అలాగే గ్రూప్-2 లో కూడా సెలక్టు అయినాను. నేను లా పాస్ అయి ఉన్నాను. నేను ఉద్యోగానికి పోతానని వారితో చెప్పాను. నీవు ఉద్యోగం చేయవద్దు, పోయి ప్రాక్టీసు పెట్టు, by the time you retire, you can become a High Court Judge. You may be appoint as District Munsif at the appropriate time. నేను ప్రాక్టీసు పెట్టిన తరువాత ఎన్నో అవాంతరాలు వచ్చాయి. చాలామంది పెద్దలు వెంకటరెడ్డి రాజకీయాలలోకి పనికి రాడనే అభిప్రాయంగా ఆయనతో చెప్పడం జరిగింది. 1967లో నాకు టికెట్ ఇవ్వడానికి వీలులేదు, ఇస్తే గెలవడు అనే అభిప్రాయంతో చాలామంది నాయకులు నన్ను అపోజ్ చేసారు. అప్పుడు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు చాలా చక్కగా కామరాజ్ నాడార్ క్యాండిడేట్ లేకపోతే మొరార్జీ దేశాయ్ క్యాండిడేట్ అని పేరుపెట్టి కాంగ్రెస్ పార్టీ తరఫున నన్ను సెలక్టు చేయించారు. టికెట్ వచ్చిన తరువాత కూడా నన్ను మార్చాలని చాలా ప్రయత్నం చేసారు. అప్పుడు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు నన్ను పిలిచి చెప్పారు. 'ఏమయ్యా - నీమీద చాలా వ్యతిరేకత వస్తున్నది; నిన్ను మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు, వారు ఏదో మాట్లాడుతూ ఉంటారు, నీవు జాగ్రత్తగా చేసుకో, గెలుపు, యంగ్ ఫెలో, నీ జీవితంలో నీవు తప్పకుండా పైకి రావాలి' అని చెప్పారు. ఆ విధంగా నేను రాజకీయాలలోకి రావడానికి కారణభూతులు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు అని మనవిచేస్తున్నాను. నేను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు కొంచెము ఆవేశపడితే - నీవు కుర్రోడివి, నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. జీవితంలో పైకి రావలసినవాడివి అని ఎడ్వయిజ్ చేస్తూ ఉండేవారు. ఒక విషయంలో నన్ను అయన చీదరించుకున్నాడు. మీరు చీదరించుకున్నా, ఏమి చేసినా జీవితంలో నాకు సహాయంచేసి రాజకీయాలలోకి తీసుకొని వచ్చిన వ్యక్తి మీరు, అందుచేత మీరు బ్రతికి ఉన్నంతకాలం మీరు వద్దన్నా, కాదన్నా మీ ఇంటి దగ్గరకు వచ్చి మిమ్ములను పలుకరించి పోతూ ఉంటానని చెప్పిన విషయం నాకు జ్ఞాపకం వస్తున్నది. నేను శాసనసభ్యునిగా ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ వారి దగ్గరకు వెళ్ళి నమస్కారం పెట్టి పరిస్థితులు చెబుతూ ఉండేవాడిని. వారు జాగ్రత్తగా ఆలోచించి చెప్పే మనిషి అని మనవిచేస్తున్నాను. నేను ఒక విషయం జ్ఞాపకం చేయాలి. ఇందాకా శ్రీ జనార్ధనరెడ్డిగారు మనవిచేసారు. నేను ఒక విషయం జ్ఞాపకం చేయాలి. ఇందాకా శ్రీ జనార్ధనరెడ్డిగారు మనవిచేసారు. ఎసెస్‌మెంట్ ఆఫ్ ఇండివిడ్యువాలిటీ రెవ్యూ చేయాలి. Assessment of an individual as one of the important qualifications of a leader. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వ్యక్తుల గురించి ఎసెస్‌మెంట్ చేయగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్న మనిషి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారు అని మనవిచేస్తున్నాను. అంతేకాదు - A man with decision, drive

and discretion - all are required to become a leader. He has all the necessary qualities. అని మనవిచేస్తున్నాను. పెద్దలందరూ ఆయన ఏవిధంగా శాకిస్మా చేసారో చెప్పారు. ఏవిధంగా ఉన్నత పదవులు అధిరోహించాలో చెప్పారు. నేను దానిజోలికి పోవడం లేదు. శ్రీ బ్రహ్మానందరెడ్డిగారికి 84 సంవత్సరాలు అయినా ఇప్పటికీ ఆయన ప్రాపర్‌గా ఎడ్వయిజ్ చేస్తూ ఉండేవారు. కృష్ణా జిల్లాలో కాని ప్రకాశం జిల్లాలో కాని ఏవిధంగా టికెట్స్ ఉండాలి, ఎలాగుండాలి అనేది నేను విజయభాస్కరరెడ్డిగారితో డిస్కస్ చేస్తాను; అన్ని విషయాలు డిస్కస్ చేస్తాను, మళ్లీ పార్టీ పవర్‌లోకి రావాలనే చెప్పేవారు. అటువంటి ఆకాంక్ష కలిగిన వ్యక్తి అని మనవిచేస్తున్నాను. రాష్ట్రానికి, దేశానికి, పార్టీకి చేసిన సేవలను మనం మరచిపోకూడదు, వారిని ఆదర్శంగా తీసుకొని పని చేయవలసిన అవసరం ఉందని మనవిచేస్తూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఎమ్. రఘుమారెడ్డి (నల్లగొండ):- అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు గొప్ప రాజకీయవేత్త, రాజకీయాలలో పండిన మనిషి. నాకు విద్యార్థి దశనుంచి వారితో సంబంధం ఉంది. రాజకీయాలలో నైతిక విలువలు దిగజారుతున్న పరిస్థితులలో తరతమ భేదాలు లేకుండా నిజాన్ని నిక్కచ్చిగా జరిగే అవకతవకలను తెలియజేస్తూ వారు ఎన్నోసార్లు పత్రికలద్వారా తమ బాధను, ఆవేదనను వ్యక్తం చేసారు. నేను పార్లమెంటు మెంబరుగా ఎలక్టు అయినప్పుడు – మేము కొత్తగా ఇక్కడకు వచ్చాము, మీ అనుభవాలు చెప్పాలని మేము అడిగితే ఎన్నో విషయాల గురించి వారు మాకు చెప్పడం జరిగింది. ఈ రాష్ట్రంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రంలో హోం శాఖ మంత్రిగా, ఇండస్ట్రీస్ మంత్రిగా, కమ్యూనికేషన్స్ మంత్రిగా, సిక్స్త్ ఫైనాన్సు కమిషన్ ఛైర్మన్‌గా, ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడిగా – అనేకమైన పదవులను అలంకరించిన వ్యక్తి ఆయన. ఆయన ఏ పదవిని అలంకరించినా ఆ పదవికి వన్నె తెచ్చి తమయొక్క నిజాయితీని రుజువు చేసుకున్నటువంటి వ్యక్తి. వారి గురించి ఒక మాట చెబుతూ ఉండేవారు. వారు ఒకసారి టోపీ సరిచేసారంటే ఎన్నో రాజకీయమైన మార్పులు వస్తాయి, రాజకీయంగా ఏదో గొప్ప మార్పు తీసుకొని వస్తారు అనే ప్రతీతి అప్పుడు ఉండేది. 7 నెలలకే ఒక ముఖ్యమంత్రి మారే ఈ రోజులలో 7 సంవత్సరాలు పరిపాలించినటువంటి వ్యక్తి ఆయన. శ్రీ జనార్దన రెడ్డిగారు చెప్పినట్లు వారి ఉపన్యాసాలు కాని ఇదివరకు వారు చేసినటువంటి సూచనలు కానీ ఒక పుస్తకం రూపంలో లైబ్రరీలో పెట్టడం మంచిది. శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎంతో హుందాగా ఉండేది. ఇప్పుడు కూడా ఆ హుందాతనాన్ని నిలబెట్టవలసిన బాధ్యత మనందరిమీద ఉందని మనవిచేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగడానికి అదే సూచనగా మనం పాటించాలని తమ ద్వారా మనవి చేస్తున్నాను. వారి కుటుంబానికి నా సంతాపం తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎమ్. ఓంకార్ (నర్సంపేట) :- అధ్యక్షా, కీర్తిశేషులు శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారు కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా, ప్రభుత్వ అధినేతగా చాలాకాలం ఉన్నారు. వారికి కమ్యూనిస్టు ఉద్యమానికి, సిద్ధాంత, రాజకీయ విషయాలపై తీవ్రమైన విభేదాలు ఉన్న సంగతి ఎవరూ దాచుకోవలసిన పనిలేదు. అయినా వారు గొప్ప దేశభక్తులు, ప్రముఖ జాతీయవాది, స్వాతంత్ర్య సమరయోధులు, పరిపాలనా దక్షులు. తెలుగు రాష్ట్రాన్ని - ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ విచ్ఛిన్నం కాకుండా సమైక్యతకోసం నిలబడిన ప్రముఖులలో వారు ఒకరు. అటువంటి మహావ్యక్తి మరణించడం అనేది మన రాష్ట్ర ప్రజలకు, దేశ ప్రజలకు తీరని లోటు. వారి మరణంపట్ల మా పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

10.50 ఉ. శ్రీ సిహెచ్. జయరాంబాబు (గుంటూరు-2) :- అధ్యక్షా, పూజ్యులు కాసు బ్రహ్మానందరెడ్డిగారు దీర్ఘకాలము రాజకీయాలలో వుంటూ, గుంటూరు జిల్లా అభివృద్ధికి ఎంతో పాటు పడడమేకాకుండా, తమరికి తెలుసు, వ్యవసాయక రంగములో నాగార్జున సాగర్ ప్రాజెక్టును మన రాష్ట్రములో తీసుకొని రావడం అందరికి తెలుసు. రోశయ్యగారు చెప్పి నట్లు, సాగర్ క్రస్టు గేట్స్ నిర్మాణములో ఎంతో చొరవ తీసుకొనినటువంటి వ్యక్తి వారు. తెలంగాణా ఉద్యమ సమయంలో వారు దృఢ చిత్తముతో స్పందించి, ఎంతో సహనము ప్రదర్శించినప్పటికీ, హై కమాండ్ కోరిక మేరకు వారు రాజీనామా కూడా చేశారు. వారు ఫయినాన్స్ కమీషన్ ఛైర్మన్‌గా వుండి, ఎక్కువ నిధులు ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం జరిగింది. వారు దేశానికి కూడా ఎంతో సేవ చేశారు. అత్యవసర కాలములో హోం మినిస్టరుగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా దేశానికి రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారు. అట్లాగే వ్యక్తిగతంగా 1985-89 లో నాకు పార్టీ టికెట్ వచ్చినప్పుడు, నా నియోజక వర్గములో పర్యటించిన వ్యక్తి వారు. ఆర్థికంగా నా గెలుపు కోసము బాగా సహాయపడిన వ్యక్తి వారు. పెద్దలు విజయ భాస్కరరెడ్డిగారిని సభా ముఖంగా కోరేది ఒకటే. రాష్ట్ర రాజధానిలో వారి పేరు చిరస్మరణీయంగా నిలిచేటట్లు ఏదో ఒక నిర్మాణాన్ని చేయాలని కోరు తున్నాను. వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ సెలవు తీసుకొంటున్నాను.

రెవిన్యూ శాఖ మంత్రి (శ్రీ కె. రామిరెడ్డి) :- అధ్యక్షా, కీ.శే. పూజ్యులు కాసు బ్రహ్మానందరెడ్డిగారి మరణంపట్ల, సభా నాయకులు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. నేను విద్యార్థి దశ నుండి అంటే 1958 నుండే విద్యార్థి నాయకుడిగా వారి నాయకత్వములో పనిచేశాను. నేను 1967 లో శాసన సభ్యునిగా ఎన్నికయిన తరువాత నాకు చీఫ్ విప్‌గా పనిచేసే అవకాశము వారి ప్రభుత్వ కాలములో వచ్చింది. అప్పుడు యువ నాయకుడిగా వున్నప్పుడు, యువకులనందరిని చక్కగా పనిచేసేటట్లు చేసి ముఖ్యమంత్రిగారికి అప్పచెప్పిన మాటను ఇప్పుడు గుర్తు చేస్తున్నాను. ఇది అందరికి తెలుసు. సెపరేట్ తెలంగాణా ఉద్యమంలో ఇంటిగ్రేషనిస్ట్‌గా నేను పనిచేశాను. వారు అనుభవాలు, వారు చేసిన సేవల గురించి కొందరు పెద్దలు చెప్పారు. వారు సుప్రీం శాక్రిఫయిస్ ఒకటి చేశారు. వారు రాష్ట్ర సమగ్రతను కాపాడారు. అది మనమెవరమూ మరువలేము. ఒక సమయంలో

ఈ సెంటిమెంట్సను బట్టి వారి సలహాను అడిగినప్పుడు, ఒక ఆలోచన మాలో వచ్చినప్పుడు, రాత్రి 11 గంటలకు మమ్ములను పిలిచి ఒక మాట చెప్పారు. చూడు రామిరెడ్డి, ఈ అజి టేషన్ పొలిటికల్‌గా చేస్తున్నారు. నా పదవిని తొలగించాలనేతప్ప మరొక నిర్ణయం కాదనే మాట అన్నారు. అప్పటినుండి నేను ఇంటిగ్రేషనిస్టుగా వుండి, వారికి అండగా నిలబడ్డాను. అజిటేషన్ సమయంలో వారు మొట్టమొదటిసారిగా నాగర్‌కర్నూలు పోయినప్పుడు అక్కడ ఫయిరింగ్ జరిగింది. ఫయిరింగ్‌లో ఒకరు చనిపోయారు. వెంటనే వారు ఇక్కడకు వచ్చి, విజయభాస్కరరెడ్డిగారిని రాత్రి 11 గంటలకు పిలిచి – వారిని భాస్కర్ అని పిలిచే వారు – చూడు భాస్కర్, ఈ పదవి ఎందుకు, పిల్లల ప్రాణాలు పోతూ వుంటే నాకెంతో బాధగా వుంది. ఈ పదవి పోయినా పరవాలేదు, అన్న వారి మాటలు నాకు ఇంకనూ గుర్తున్నాయి. అటువంటి సున్నితమైన మనస్సుగలవారు బ్రహ్మానందరెడ్డిగారు. వారీనాడు మన మధ్య లేరు.

కోస్టల్ ఏరియాలో సైక్లోన్ వచ్చినప్పుడు, అక్కడ వారు టూర్ చేసిన తరువాత వీకర్ సెక్షనీ హౌసింగ్ ప్రోగ్రాము పెడితే బాగుంటుందని మొట్టమొదటిసారిగా వీకర్ సెక్షన్ హౌసింగ్ స్కీమును ఏర్పాటుచేసి, ఎందరికో గృహ వసతి కల్పించారు.

బి.సి.లకు 25 శాతం రిజర్వేషన్ పెట్టాలని వారు పట్టుపట్టి, అది హైకోర్టులో కొట్టివేసిన తరువాత సుప్రీం కోర్టుకు వెళ్ళి, వారికి రిజర్వేషన్ తప్పనిసరియని పట్టుపట్టి, దాన్ని సాధించడం అందరికి తెలియనిది కాదు.

మా దగ్గరున్న లంబాడీలను ట్రయిబల్స్‌లో చేర్చాలని రీజినల్ కమిటీలో రెజల్యూషన్ పాస్ చేస్తే, దాన్ని వారు కేంద్ర ప్రభుత్వానికి పంపితే అది చాలా కాలము పెండింగులో వుండుంది. తరువాత వారు హోం మినిస్టరు అయిన తరువాత, డినోటిఫయిడు ట్రయిబల్స్‌ను, ట్రయిబల్స్‌లో చేర్చగలిగారు.

మద్రాసులో చెంగల్‌పట్ జిల్లా ఎట్లా అయితే వుందో అలాగే హైదరాబాదు జిల్లాను చేయాలని మేము ఎప్పుడు కలెక్టరు వద్దకు వెళ్ళినా, వారు ఎప్పుడూ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళి నారని చెప్పేవారు. రూరల్ జిల్లా కావాలని మేము రీజినల్ కమిటీలో రెజొల్యూషన్ పాస్ చేయగా, వారు దాన్ని రెకమండ్ చేసిన మాట నేనీరోజు గుర్తు చేస్తున్నాను. ఈలాగా వారు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఈనాడు వారు మన మధ్య లేరు. బ్రహ్మానందరెడ్డిగారి ఆత్మకు శాంతి కలుగాలని, వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ కె.కె. రెడ్డి (నెల్లూరు):– అధ్యక్షా, పూజ్యులు కాసు బ్రహ్మానందరెడ్డిగారి మరణము రాష్ట్రానికే గాక, దేశానికే తీరని లోటు. ఇది అందరికి తెలుసు. మహా నాయకుడు

వారు. రాష్ట్రాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకొన్నారు. ముఖ్యమంత్రిగా చాలా కొద్ది మందికే అవకాశము వస్తుంది. కానీ వీరున్న పదవీ కాలములో ఎన్నో రాష్ట్రాభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా, ప్రత్యేకంగా రాష్ట్రాన్ని సమైక్యంగా వుండేటట్లు వారు చేసిన త్యాగము ఇది అందరి మనస్సులలో నిలిచిపోయేటట్లు చేశారు. వారు అటు కేంద్రములోనూ ఎక్కడ వున్నప్పటికీ కీర్తి ప్రతిష్టలు రాష్ట్రానికే కాకుండా, దేశానికి కూడా తీసుకొని వచ్చారు. వారి సంపదను రాష్ట్రాభివృద్ధికి వినియోగించారు. వారు అహర్నిశలు కృషిచేసి, వారి కుటుంబ సంపదను పెంచుకోకుండా, రాష్ట్ర సంపదను పెంచుకోడానికి ప్రయత్నము చేశారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

పంచాయితీరాజ్ శాఖా మంత్రి (శ్రీ డి.కె. సమరసింహారెడ్డి):-అధ్యక్షా, పెద్దలు, పూజ్యులు బ్రహ్మానందరెడ్డిగారి మరణము తీరని లోటు. వారు మన మధ్యలేరు. వారి మరణంపట్ల నా సంతాపాన్ని వ్యక్తము చేస్తూ, ప్రియతమ నాయకులు, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తున్నాను. అధ్యక్షా, రాజకీయాల్లోకి ఎంతోమంది వస్తూ వుంటారు, పోతూ వుంటారు. Some people survive in politics by manipulation and some people survive in politics by their administrative capacities, but a real politician is one who is able to sinchronise both the things and become a successful politician. ఒక సక్సెస్‌ఫుల్ పొలిటీషియన్‌గా, ఈనాడు భారతదేశ చరిత్రలో చరిత్రకారులు భవిష్యత్తులో చరిత్రను లిఖించేటప్పుడు వారు ఐడెంటిఫయి చేసే టటువంటి అతిరథ 'మహారథులలో అగ్రగణ్యమైన స్థాయికి చెందినటువంటి వ్యక్తిగా
11.00 బ్రహ్మానందరెడ్డిగారిని మనందరం అభినందించక తప్పదని మనవిచేస్తున్నాను. ఎందుకంటే
ఉ. రాష్ట్రపతి పదవి, ఉపరాష్ట్రపతి పదవి, ప్రధానమంత్రి పదవి తప్ప దేశములో ఉన్న అన్ని ప్రముఖమైన పదవులను కూడా నిర్వహించి ఎంతో అనుభవజ్ఞుడుగా పేరు తెచ్చుకున్నటు వంటి బ్రహ్మానందరెడ్డిగారు ఈ రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశ చరిత్రలోనే వారు నిర్వహించి నటువంటి పాత్ర ఎవరు ఎప్పటికీ కూడా మరువలేనటువంటిదని మనవిచేయక తప్పదు. అందులోను ప్రధానంగా ఎమర్జెన్సీ సందర్భముగా వారు అప్పుడు హోమ్ మంత్రిగా నిర్వహించినటువంటి పరిస్థితి దేశ రాజకీయాలలో వచ్చినటువంటి మలుపు ఈనాడు కూడా చరిత్రకారులు, భవిష్యత్తులో కూడా చరిత్ర అంటూ వ్రాసినప్పుడు ఆ చరిత్రలో వారికి ఇచ్చి నటువంటి స్థానం మటుకు ఎవరూ కూడా పొందడానికి వీలులేనటువంటిది. వారి స్థానం, అటువంటి స్థానం పొందగలిగినటువంటి పరిస్థితి అని మనవిచేస్తున్నాను. వారికి ఇచ్చినటు వంటి నివాళి మన రాష్ట్రానికి వారు చేసినటువంటి సేవలను ప్రస్తుతిస్తూ ఎన్ని మాట్లాడినా, చిరస్మరణీయంగా ఎప్పటికి రాష్ట్రం లోపల సూర్యచంద్రాదులు ఉన్నంతకాలం ఉండే పద్ధతి లోపల ఏదైనా ఒక దానిని ఏర్పాటుచేసుకుంటే బాగుంటుందని ఈ సందర్భముగా నేను మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉన్నత విద్యాశాఖ మంత్రి (శ్రీ ఎ. ధర్మారావు):– అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానముతో ఏకీభవిస్తూ, నాకు ముందు మాట్లాడిన ప్రముఖులు అందరూ వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, బ్రహ్మానందరెడ్డిగారు ఈ రాష్ట్రానికి చేసిన సేవలను మరి మనం కొంచెము సమయం ఎక్కువ తీసుకున్నా మననం చేసుకోవడం అవసరమని భావిస్తున్నాను. బ్రహ్మానందరెడ్డిగారు మహాత్మా గాంధీ హయాములో మొదటి తరగతి నాయకుడు కాకుండా రెండవ తరగతి స్వాతంత్ర్య సమరయోధుల తరానికి చెందిన వారు. మొదటి తరానికి చెందిన కొండా వెంకటప్పయ్య పంతులుగారు, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు మరి పట్టాభి వగైరాల క్రింద ఆయన వారి అనుయాయుడుగా ఉంటూ అగ్రగామి స్వాతంత్ర్య సమరయోధుడుగా పైకి వచ్చారు. ఆయన తన జీవిత విశేషాలను గురించి చెప్పుకొనేటప్పుడు అన్నింటి కంటె నేను 9 సంవత్సరాల వయస్సులో మహాత్మాగాంధీని చూడగలిగానని చెప్పడం, అది ఒక గొప్ప వింతగా, ఆశ్చర్యముగా, గౌరవముగా చెప్పుకుంటూ ఉండేవారు. ఆయన యొక్క దేశభక్తికి అది తార్కాణమని నేను భావిస్తున్నాను. స్వాతంత్ర్య సమరయోధుడు, దేశభక్తుడిగా కాకుండా పరిపాలనో కూడా ఒక రాజకీయవేత్తగాను, స్టేట్స్‌మెన్‌గా రాజనీతిజ్ఞుడిగా ఆయన భారతదేశం అంతా ప్రఖ్యాతి చెందారు. మరి ఆయనను పరిపాలనాదక్షుడు అని అనడములో సందేహం లేదు. ఆయన జిల్లా బోర్డు ఛైర్మన్‌గా, శాసనసభ్యుడిగా రాష్ట్రములో పలుమార్లు మంత్రిగా, ముఖ్య మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా అనేక పదవులను ఆయన ఎంతో దక్షతతో నిర్వహించి పరిపాలనాదక్షుడు అనేటటువంటి కీర్తిని ఆర్జించారు. పెద్దలు చెప్పి నట్లుగా ఆయన ఓర్పుకు, సహనానికి, నేర్పుకు కూడా ఆయన అందవేసిన చేయి. ఆయన కంటె మరెవరూ లేరనేటటువంటి దానిలో అతిశయోక్తి ఏమీలేదని చెప్పి నా అభిప్రాయం. బ్రహ్మానందరెడ్డిగారి హయాములోనే ఈ రాష్ట్రములో అతి ముఖ్యమైనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచేటట్లు, శాశ్వత ఫలితాలు ఇచ్చేటటువంటి కార్యక్రమాలు జరిగాయి అనడములో అతిశయోక్తి ఏమీ లేదని భావిస్తున్నాను. నాగార్జునసాగర్ ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు లాంటి ప్రధానమైన ప్రాజెక్టులు ఆయన హయాములోనే ఊపందుకొని ముందుకు హెచ్చుగా సాగిపోయాయి, నిర్మాణం దాదాపు పూర్తి చేసుకున్నాయని స్పష్టముగా మనకు తెలుసు. రోశయ్యగారు చెప్పినట్లుగా ముఖ్యముగా నాగార్జున సాగర్ ప్రాజెక్టులో క్రెస్ట్ గేట్స్ పెట్టడములో ఆయన ఉపయోగించి నటువంటి చాకచక్యం మరువరానిది. ఆంధ్రకు చిరస్థాయిగా ఆంధ్రులు గుర్తుంచుకొనేటటు వంటి సదుపాయాన్ని ఉపకారాన్ని ఆయన తన చాకచక్యం ద్వారా సాధించిపెట్టారు. బ్రహ్మానందరెడ్డిగారి హయాములోనే వారి కేబినెట్‌లో చాలా మంది ఈ రాష్ట్రానికి అతి ముఖ్యమైనగ రాజకీయ నాయకులు పైకి వచ్చారు. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పరిపాలనాదక్షులుగా తయారయినటువంటి అనేకమందిని, వెంగళరావుగారు మొదలుకొని, చెన్నారెడ్డిగారు, విజయ భాస్కరరెడ్డిగారు, ఈనాడు మన భారత ప్రధానిగా ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతులు అందుకున్నటువంటి నాయకుడిగా ఉన్నటువంటి మన పి.వి. నరసింహా రావుగారు కూడా ఆయన కేబినెట్‌లోనే అనుభవం సంపాదించినటువంటి వ్యక్తులు. అటువంటి

దిట్టమైనటువంటి వారిని ఈ రాష్ట్రానికి నాయకత్వం అప్పగించిన ప్రతిష్ఠ కూడా బ్రహ్మానంద రెడ్డిగారికే దక్కుతుంది. 6వ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయన 'అప్‌గ్రెడేషన్ ఆఫ్ స్టాండర్డ్స్' అని చెప్పి ఒక కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టి జుడీషియరీకి కావలసినటువంటి భవన నిర్మాణానికి కేంద్రము నుంచి ఆర్థిక సహాయం తీసుకొచ్చినటువంటి సదుపాయాన్ని కల్పించారు. దానిని ఇటీవలన మన ముఖ్యమంత్రిగారు ప్లాన్‌లో కూడా చేర్పించి శాశ్వతంగా కార్యక్రమానికి దోహదం చేశారు. మరి పెద్దలందరు చెప్పినట్లుగా ఈ రాష్ట్ర సమైక్యతను, దీర్ఘకాలిక ప్రయోజనాన్ని కాపాడడం కోసం ఆయన ముఖ్యమంత్రి పదవిని పరిత్యజించార్ను. అదే ఒరవడిలో తరువాత మన పి.వి. నరసింహారావుగారు కూడా పరిత్యజించారు. ఈ త్యాగాల ఫలితంగానే ఈనాడు రాష్ట్ర సమైక్యత నిలబడింది అంటే అది ఆశ్చర్యం ఏమీ కాదు. అటువంటి మహానుభావుడికి నివాళులు అర్పిస్తూ, ఈ రాష్ట్రములో ఆయన చిరస్మర ణీయుడుగా ఉండేటందుకు కావలసినటువంటి ఏదైనా చిహ్నము, స్మృతి చిహ్నము ఏర్పరచడం అవసరమని భావిస్తూ, మీకు నా ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. అప్పలనాయుడు (ఉత్తరపల్లి) :- గౌరవనీయులు ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టినటువంటి ఈ తీర్మానాన్ని బలపరుస్తూ, బ్రహ్మానందరెడ్డిగారు మహామనీషి, ప్రజల మనీషి – ముఖ్యంగా వారి పరిపాలనా హయాములో నేను రెండుసార్లు శాసనసభ సభ్యుడిగా ప్రజల అభీష్టంమైన ఇండిపెండెంటుగా ఎలక్ట్ అయి వారి పరిపాలనా విధానములో పాలు పంచుకున్నటువంటి విషయం తమకు తెలియపరుస్తున్నాను. ముఖ్యంగా బ్రహ్మానంద రెడ్డిగారికి స్వపక్షం పరపక్షం అన్నటువంటి భావం లేకుండా ప్రజా కార్యక్రమాలమైన, ప్రజా విధానాలమైన ఆయన దృష్టి మళ్లించి కార్యక్రమాలు చేసినటువంటి విషయం నాకు పూర్తిగా తెలిసినటువంటి విషయం. ఎందుచేతనంటే నేను ఇండిపెండెంటుగా ఉన్నప్పటికి కూడా అనేక కార్యక్రమాలలో నాకు ఆయన సహాయ సహకారాలు అందించడమే కాకుండా వారు మా ప్రాంతానికి వచ్చినప్పుడు – ముఖ్యంగా భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ 12 మండలా లకు సంబంధించినటువంటి దానికి 1971లో ఆయన ఫౌన్‌డేషన్ స్టోన్ వేయడానికి వచ్చి నప్పుడు నేను వారిని నా గ్రామానికి రావాలని, మా ఇంటికి రావాలని, భోజనం చేయాలని నేను వారిని ఆహ్వానించాను. కాని అప్పుడు ఉన్నటువంటి కాంగ్రెస్ పెద్దలు అందరూ కూడా ఇండిపెండెంటు సభ్యుడు అప్పలనాయుడు ఇంటికి వెళ్ళడం ఏమిటి, మేమందరం ఉన్నాము, మా ఇంటికి రండి అన్నప్పటికి కూడా, లేదు నేను అప్పలనాయుడు ఇంటికి వెళ్లి భోజనం చేస్తానని చెప్పి 12 గంటలకు ఫౌండేషన్ స్టోన్ వేసి మా ఇంటికి వచ్చి భోజనం చేసి 4 గంటలవరకు విశ్రాంతి తీసుకొని 5 గంటలకు మా స్వగ్రామమైన కాసాపేటలో ఇరిగేషన్ బహిరంగసభ పెడితే అక్కడికి కూడా వచ్చి లక్ష, లక్షా యాభైవేల మందితో వారు మాట్లాడిన విషయం కూడా మీకు మనవిచేస్తున్నాను. అంతేకాకుండా మరొకసారి భీమాలి అనే చిన్న గ్రామములో ఒక చెరువు ఎంతో కాలం నుంచి మరమ్మత్తులు లేకుండావున్నదని చెప్పి ఆ గ్రామం రండని నేను కోరితే వారు గ్రామం వచ్చి అక్కడ బహిరంగ సభలో ఆయన అన్నటు వంటి రెండు మాటలు ఇప్పటికీ నా చెవులలో రింగుమనడమే కాకుండా ఆ మాటల పైననే, నేను ఒక రకంగా వాటిని ఉచితముగా తీసుకొని రాజకీయం చేసినటువంటి పరిస్థితి ఏర్పడింది.

వారు అన్న మాటలు ఏమిటంటే 'మా అప్పలనాయుడు చాలా మితభాషి, అవసరం ఉంటే కాని మాట్లాడడు, మీ చెరువు మరమ్మత్తులకు లక్ష రూపాయలు అతను అడిగితే కోటికి ఎడమ చేతితో సంతకం పెడతాను' అన్న మహానుభావుడు ఆయన. అందుచేత, ఆ రకమైనటువంటి భావముతో రాజకీయాలు చేసినటువంటి మహా వ్యక్తి. వారు ఈ రాష్ట్రములోనే కాకుండా, ఈ దేశములోనే కాకుండా, ప్రపంచములో కూడా ఒక ప్రముఖ వ్యక్తిగా, ముఖ్యంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాధించడమే కాకుండా ఏదైనా కౌన్సిల్ ఎలక్షన్, రాజ్య సభ ఎలక్షన్ వచ్చినప్పుడు ఎవరైనా గెలవాలి అనుకున్నప్పుడు నన్ను మాత్రం ఆ కేండిడేట్‌కి ఎలాట్ చేసేవారు. ముఖ్యంగా ఈ సభలో ఉన్నటువంటి గౌరవ మంత్రివర్యులు రోశయ్యగారికి నేను ఓటర్‌ను కూడా. అందుచేత ఆ రకమైన భావముతో ఈ కార్యక్రమాలు అన్నీ జరిగినటువంటి విషయం మీకు తెలియజేస్తున్నాను. ఆయన లేని లోటు కనపడుతోంది. ఆయన చాలా ధీమంతుడు. శక్తి, సామర్థ్యత కలిగి అనేక రకాలైనటువంటి హోదాలను, పదవులను నిర్వహించినటువంటి మహా మనీషి. అందుచేత వారు చేపట్టిన కార్యక్రమాలకు ఎన్ని అడ్డంకులు వేసినా సరే వాటిని సాధించిన ధీశాలి బ్రహ్మానందరెడ్డిగారు. అటువంటివారు లేకపోవడం ఈవేళ రాష్ట్రానికి తీరని లోటు. వారు కేంద్రములో ఉన్నా రాష్ట్రానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేవారు. అటువంటి మహానుభావుడు ఆయన. ఆయన టైములో ఢిల్లీ వెడితే ఆయన అన్నదాతగా పేరుగాంచిన మహానుభావుడు బ్రహ్మానందరెడ్డిగారు అని చెప్పి మీకు సవినయంగా మనవిచేస్తున్నాను. వారి మరణానికి సంతాపం, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలుపుతూ, మీకు ధన్యవాదాలు తెలుపుతూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ అల్లూరి సుభాష్ చంద్రబోస్ (భీమవరం).- అధ్యక్షా, "బ్రతికుండి చనిపోయిన 11-00
వారు చాలా మంది, చనిపోయీ బ్రతికుండేవారు కొంతమంది" - ఆ రెండవ కోవకు ఉ.
చెందిన వారు బ్రహ్మానందరెడ్డిగారు. వారు నాకు నా చిన్నతనంనుంచి చిరపరిచితులు. వారు జనరల్ సెక్రటరీగా ఉన్నప్పుడు, తరువాత ఫైనాన్స్ మినిస్టరుగా వున్నప్పుడు, ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు, హోం మంత్రిగా వున్నప్పుడు, అలాగే గవర్నరుగా వున్నప్పుడు కూడా మేము ఆయనను ఎప్పుడూ కలుస్తుండేవాళ్ళం. మా అదృష్టం ఏమిటంటే మా తండ్రిగారు సత్యనారాయణరాజుగారితోనూ, మా తల్లిగారు అన్నపూర్ణాదేవిగారితోనూ, అలాగే నాతో కూడా కలిసి, పార్లమెంటులో కూర్చున్నారు ఆయన. ఆయనతో మొదటినుంచీ మా కుటుంబానికి సంబంధం ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఇక బ్రహ్మానందరెడ్డి గురించి ఒక్క మాటలో చెప్పాలంటే - A man who thinks of next elections is a politician. A man who thinks of next generation is a statesman. He belonged to that category of statesman. భావితరాల గురించి ఆలోచించే వ్యక్తే, తప్ప రాబోయే ఎలక్షన్ల గురించి ఆలోచించేవారు కాదు ఆయన. ఆయన పెద్ద వయసులో వుండి నేను చిన్నవాడిని అయినా పెద్దవారితో ఎట్లా మాట్లాడేవారో నాతోనూ అట్లాగే మాట్లాడేవారు. ఎవరికి సంబంధించిన భాషలో అయినా మాట్లాడడం

ఆయనకు అలవాటు. ఆ కుటుంబానికి నా తరఫున సంతాపాన్ని తెలియజేయవలసిందిగా ముఖ్యమంత్రిగారిని కోరుతూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తూ సెలవుతీసుకొంటున్నాను.

విద్యాశాఖ మంత్రి (డాక్టర్ పి.వి. రంగారావు) :– అధ్యక్షా, కాలపు ఇసుక తిన్నెల మీద చెరగని ముద్రవేసి, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తనదైన ఫక్కీలో, తనదైన బాణీలో రాష్ట్ర సమైక్యతకోసం, తనకోసం ఒక స్థానాన్ని సుస్థిరం చేసుకొన్నవాడు శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారు. శ్రీమతి ఇందిరాగాంధీ, శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు, శ్రీ పి.వి. నర్సింహా రావుగారు – ప్రజా సమస్యలమీద వత్తిడులకు లొంగకుండా ఎప్పుడు నిర్ణయం తీసు కొంటారో ఎవరికీ చెప్పకుండా నిర్ణయం తీసుకొనేవారు ఈ ముగ్గురే. బహుశా ఈ ముగ్గురూ ఒకే రాజకీయ పాఠశాలలో విద్యార్థులో, అధ్యాపకులో లేక క్లాస్–ఫెల్లోస్ అయి వుంటారని అనుకొంటాను. బ్రహ్మానందరెడ్డిగారు మనసులో ఏముందో బ్రహ్మకు కూడా తెలియదని మన ప్రియతమ ముఖ్యమంత్రి విజయ భాస్కరరెడ్డిగారు 1968 లో అన్నారు బ్రహ్మానందరెడ్డిగారిలో వున్న చాలా గొప్ప విషయం ఏమిటంటే సలహాలు ఇవ్వడం కాదు, సలహాలు తీసుకొనేవారు. సలహాలు అడిగితే ఇచ్చేవారు, కాని సలహాలు తీసుకొనేవారు. అలా సలహాలు తీసుకొనే గుణాన్ని మనం అలవరచుకొంటే అనేక సమస్యల పరిష్కారానికి మార్గం మరింత సుగమం అవుతుంది. ముఖ్యంగా సిమ్లాలో ఏ.ఐ.సి.సి. సెషన్ జరిగినప్పుడు బాంగ్లాదేశ్ మీద తొందరగా యుద్ధాన్ని ప్రకటించాలి, ముక్తి బాహినిని తొందరగా గుర్తించాలని శ్రీమతి ఇందిరాగాంధీ చాలా వత్తిడి చేస్తున్నప్పుడు బ్రహ్మానంద రెడ్డిగారు నన్నొక చిన్న సలహా అడిగారు, ముక్తిబాహిని సైన్యాన్ని గుర్తించాలా వద్దా అనేది. కాని ఒక్క ముక్తి బాహినిని గుర్తిస్తే చైనావారుగానీ లేక పాకిస్తాన్ వారుగానీ మన భారతదేశంలోని 5, 6 రాష్ట్రాలలో ఉన్న అజ్ఞాత ప్రభుత్వాలను గుర్తించి వారికి సహాయం చేసే అవకాశం ఉంది గనక సరైన సమయంలో నిర్ణయం తీసుకొని, ఆ నిర్ణయం తీసుకొన్నా 24 గంటలలోగా అమలుపరచాలని నేను ఇచ్చిన చిన్న సలహాను తీసుకువెళ్ళి శ్రీమతి ఇందిరాగాంధీగారికి ఇచ్చారు. అది బాంగ్లాదేశ్ మీదికి సైన్యాన్ని ఏవిధంగా నడిపించాలన్న నిర్ణయం 15 రోజులపాటు వాయిదావెయడానికి కారణం అయింది. ఇక్కడ కొంత చరిత్ర చెప్పడం అవసరం. 1968 లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం జరిగింది, ఇప్పుడు ఇక్కడ వున్నవారిలో చాలామందికి ఆ ఉద్యమం తీవ్రత తెలియదు. ఆ రోజులలో "ప్రజాసమితి"ని ప్రారంభం చేసిన 24 గంటలలోగా ఆంధ్రప్రదేశ్ సమైక్యతా సమితిని ఏర్పాటుచేయడం జరిగింది. అప్పుడు నేను ఉస్మానియా యూనివర్సిటీ సిండికేట్ మెంబర్గా ఉండేవాడిని. నన్ను ఆంధ్రప్రదేశ్ సమైక్యతా సమితికి అధ్యక్షుడిగా చేశారు. ఆ రోజులలో విజయ భాస్కరరెడ్డిగారు బృందావన్ హోటల్లో విద్యార్థులందరికీ ఒక గ్రూప్గా పెట్టి హైదరాబాదుకు ఆంధ్ర ప్రాంతాలనుండి వచ్చిన ద్రాక్ష తోటల యజమానులకుగానీ, తెలుగు మాట్లాడేవారికి గానీ ఏమైనా ఆపద కిగితే మమ్ములనందరినీ విజయభాస్కరరెడ్డిగారి

నాయకత్వంలో ప్రాణాలకు తెగించి వారి ఆస్తిపాస్తుల్ని కాపాడే ధైర్యాన్ని, క్రమశిక్షణనూ కల్పించారు. ఇక వారు ఈనాడు నిర్లిప్తతతో మృత్యువును ఆహ్వానించారేమోనని అనిపిస్తుంది....

శ్రీ పి. రామచంద్రారెడ్డి:– సంతాపం తెలియజేయండి.....

డాక్టర్ పి.వి. రంగారావు:– సంతాపం అంటే ఊరికే బ్రహ్మానందరెడ్డిగారిని తిట్టే వారు కూడా ఆహా, బ్రహ్మానందరెడ్డిగారు చాలా గొప్పవాడు అని చెప్పడం చాలా సులభం. అందువల్ల ఊరికే సంతాపాన్ని తెలియజేయడం కాకుండా ఆ మహానుభావుడి జీవితంనుంచి కొంతైనా నేర్చుకొని కొంత సంయమనాన్ని, సహనాన్ని అలవరచుకొంటే బాగుంటుందనే ఉద్దేశంతో చెపుతున్నాను. ఏవిధంగా విపత్కర పరిస్థితులలో ధైర్యాన్నే, ఆత్మస్థైర్యాన్నే కోల్పోకుండా ప్రవర్తించేవారో మేముందుంచాను. మనిషి పుట్టినప్పుడు తాను ఏడుస్తాడు, ఇతరులు నవ్వుతారు. కాని మనిషి చనిపోయినప్పుడు తాను చిరునవ్వుతో చచ్చిపోయి తన వారందరు ఏడిస్తే అతడు మహామహుడు, అతను గొప్పవాడు అని నేను భావిస్తాను. ముఖ్యంగా శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు మరణించినప్పుడు విజయభాస్కరరెడ్డిగారూ, మేమూ ప్రత్యేక విమానంలో అక్కడికి వెళ్ళినప్పుడు వేలాది మంది శోకార్తులై కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నప్పుడు – అధికారాంతమందు చూడవలె ఆ అయ్య సౌభాగ్యముల్ అన్నట్టు – అధికారంలో లేనప్పుడు స్వతం వేలాదిమంది కన్నీరుమున్నీరుగా విలపించారంటే వారి కన్నీరే సాక్ష్యం బ్రహ్మానందరెడ్డిగారు ప్రజల హృదయాలలో శాశ్వతంగా ఉంటారని అనడానికి. నేను హృదయపూర్వకంగా మన ప్రియతమ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (వినుకొండ):– అధ్యక్షా, బ్రహ్మానందరెడ్డిగారి మరణంపట్ల ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ ఆయన పార్లమెంటు నియోజకవర్గంలోని ఒక శాసనసభా నియోజకవర్గానికి ప్రాతినిధ్యంవహిస్తున్న నేను ఎంతో ఆవేదనతో కొన్ని విషయాలు చెప్పదలచుకొన్నాను. ఆయన లేని లోటు దేశానికే పెద్ద లోటని అందరూ చెప్పారు, ఈ రాష్ట్రానికి అంతకన్నా పెద్ద లోటని చెప్పారు. నిజంగా జిల్లా అంతా శోకసముద్రంలో మునిగిపోయిందని చెపుతూ ఈవేళ నా నియోజకవర్గంలో నేను ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేశానని ఎవరైనా అన్నా లేక వ్రాసినా అది బ్రహ్మానందరెడ్డిగారి ప్రోత్సాహంతోనే చేశానని ఎప్పుడు చెపుతూవచ్చాను; అందువల్ల ఆయన మరణం నాకు రాజకీయంగా, వ్యక్తిగతంగా కూడా తీరని లోటు, ఆయన లేకపోవడం నేను మరచిపోలేని బాధ అని కూడా మనవిచేస్తున్నాను. ఆయనకు ఒక ప్రత్యేకత ఉండేది. ఆయన చేతలలో ఒక ప్రత్యేకత ఉండేది, ఆయన మాటలలో ఒక ప్రత్యేకత ఉండేది, ఆయన టోపీలో ఒక ప్రత్యేకత ఉండేది. ఆయన చేతలలో రాజనీతి ఉండేది, ఆయన ఉపన్యాసంలో చమత్కారం ఉండేది, ఆయన టోపి తిప్పడంలో రాజకీయం వుండేది. ఆ విధంగా, చిన్న వయస్సులో 11:20
నాకు పెద్దగా ధైర్యం లేకపోయినా ఆయనను చూశాను. అప్పటినుంచి కూడా వారు మా ఊ;

ఫ్యామిలీకి బాగా దగ్గరగా వుండేవారు. ఈనాడు ఆయన కుటుంబానికి ఎంతో సన్నిహితంగా వున్న నేను యీరోజు నరసరావుపేట నియోజకవర్గంలో ఒక విగ్రహాన్ని వేసి ఆయన విగ్రహాన్ని చూసి ఆయనను మరచిపోకుండా వుండాలని అనుకుంటున్నాను. అయితే, విగ్రహం వేసినందువల్ల, దాన్ని చూస్తేనే కాకుండా ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని అనుకుంటున్నాను. ఈనాడు భారత ప్రధాని స్వయంగా యిక్కడకు వచ్చి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఏ ప్రధాని అయినా ఒక వ్యక్తి, ఒక రాష్ట్రంలో గాని మరణించాడంటె ఎప్పుడైనా వెళితే లేకపోతే, అటు వెళ్ళినప్పుడు మాత్రం పలకరించి వస్తారు ఏమో గాని, ప్రత్యేకంగా వచ్చి ఆయన కుటుంబానికి సంతాపాన్ని తెలియచేడానికి ప్రధానమంత్రి శ్రీ పి.వి. నర్సింహారావుగారు వచ్చారు అంటే బ్రహ్మానంద రెడ్డిగారు ఎంత గొప్ప వ్యక్తో తెలుసుకోవాలి. రాగులు, జొన్నలు, సజ్జలు, తిండి సరిగా దొరకని రోజులలో తెలంగాణా, గుంటూరు జిల్లాలలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు రావడానికి కృషిచేసిన వ్యక్తి. రైతాంగానికి ఎంతో సేవచేసి, నల్లగొండ, గుంటూరు జిల్లాలే కాకుండా, లెఫ్టు కెనాల్, రైటు కెనాల్ ద్వారా లక్షలాది ఎకరాల భూమిని సస్యశ్యామలం చేశారు. వారిని మర్చిపోలేరు. ఇది అంతా చెప్పడానికి టైమ్ లేదు కనుక దయచేసి ఎంతో మంది మాట్లాడిన కూడా, ఎంతో చెప్పినా కూడా ఆయన ఆత్మకు శాంతికలగాలని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తూ, ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచు కోవాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ (శ్రీ టి. వేదవ్యాస్) :- అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, యీ రోజు రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి చెందడానికి ముఖ్యకారకులు, పునాది వేసినటువంటి వారు బ్రహ్మానందరెడ్డిగారు. ఆయన లేని లోటు తీర్చలేనిది. వారు ముఖ్యమంత్రిగా వున్నప్పటినుంచి కూడా నేను వారిని చూడడం జరిగింది. మా కుటుంబానికి సన్నిహితులు – నేను నా చిన్నతనంలో వారిని కలిసినప్పుడు నా పేరు పెట్టి పిలుస్తూ, నేవు ఏమీ భారతం వ్రాస్తావు అని అనేకసార్లు అన్నారు. నేను శాసన సభ్యుడు అయిన దగ్గరనుంచి కూడా వారితో అనేకసార్లు కలవడం జరిగింది. కలిసినప్పుడు కూడా అనేక విషయాలు ఆయన ద్వారా తెలుసుకోవడం జరిగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అంత పెద్ద వయస్సులో కూడా ఆయన రాష్ట్రంలో వున్న అనేక ప్రాంతాల సామాజిక పరిస్థితులను, రాజకీయ పరిస్థితులను గురించి కూడా చెప్పుతుండే వారు. అదే కాకుండా, ఆయన టీమ్‌లో వున్నటువంటి ప్రజాప్రతినిధులు, యిప్పుడు యీ రోజు వున్న ప్రజాప్రతినిధులు, పేరు పేరునా కూడా చెప్పుతూవుంటె నాకు చాలా ఆశ్చర్యం వేసేది. ఆయన పరిపాలనా దక్షతకు నేను చాలా ఇన్‌స్పైర్ అయిన మాట వాస్తవం. వారి యొక్క స్పీచెస్, వారి పరిపాలన, వారి యొక్క అనుభవములను ఒక వాల్యూమ్ రూపంలో శ్రీ ఎన్. జనార్ధన్‌రెడ్డిగారు చెప్పినట్లుగా వేస్తే భావితరాల వారికి ఉపయోగపడుతుంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

వాణిజ్య పన్నుల శాఖ మంత్రి (శ్రీ కుడుపూడి ప్రభాకరరావు):- అధ్యక్షా, పితృ సమానులైనటువంటి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు నేను ఇండిపెండెంటు శాసన సభ్యుడుగా వున్నాను. వారి యొక్క అభిమానాన్ని చూరగొంటూ, దగ్గరలో ఆయనను చూసి, ఆయనలో వుండె మంచి తనాన్ని గ్రహించె అవకాశం నాకు కలిగింది. నేను గ్రహించిన మొట్టమొదటి విషయం ఏమిటంటె, లా కాలేజి ప్రొఫెసర్ వుండేవారు - He said 'patience is a virtue of royalty.' ఆ విధమైన పేషెన్సు - it is a monument of patience.... బ్రహ్మానందరెడ్డిలో నేను చూశాను - ఎన్నో కష్టాలు వచ్చినప్పటికి, ఎన్నో అవాంతరాలు వచ్చినప్పటికి కూడా ఎంతో నిగ్రహంతో - తెలివితేటలతో వాటిని సాధించడానికి ప్రయత్నం చేసేవారు. ఒకానొకప్పుడు, యిప్పుడు ఏది అయితే క్రస్టు గేట్స్ గురించి మనవిచేశారో, ఆ సమస్య అసెంబ్లీలో డిస్కషన్‌కు ప్రతిపక్ష నాయకులు నాగార్జున సాగర్ క్రస్టు గేట్ల గురించి డిస్కషన్ చేయాలన్నప్పుడు అనాడు బహుశ: శ్రీ రాఘవరెడ్డిగారు పెద్దలు వారు కూడా ప్రతిపక్షంలో ఉన్నారు. ఆయన చెప్పిన మాట ఒకటి - దయచేసి, ఈ విషయం అసెంబ్లీలో మాత్రం చర్చించే విషయం కాదు. యిది చాలా సున్నితమైన విషయం - నా ఛాంబర్స్‌లో మాట్లాడుదాము రండని పిలిచారు. యీ విషయం అసెంబ్లీలో మాట్లాడితే ఇది నేషనల్ ప్రెస్‌కు వెళ్ళుంది. మన లక్ష్యం దెబ్బతింటుంది. అది చర్చించవద్దు అని చెప్పి అల్టిమేట్‌గా అనుకున్న లక్ష్యాన్ని సాధించినటువంటి మహనీయుడు. He is a man of broad vision.... ఆయన చేసిన కార్యాలు పెద్దలు అనేక విషయాలు చెప్పారు. మరొకటి, మరొకటి చెప్పారు. రైతాంగానికి చేసిన మహోన్నతమైన ఉపకారాలు గోదావరి ఆనకట్ట శిథిలావస్థలో వున్ననప్పుడు, 120 సంవత్సరాలు అయినప్పుడు, దాని జీవితం అయినప్పుడు ఆనకట్ట కూలిపోతుంటె, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ ధైర్యంగా గోదావరి బ్యారేజ్‌కు శంకుస్థాపన చేసి, ప్రజలను కూడా ఇన్‌వాల్వు చేసిన మహనీయుడు. అలాగే, కృష్ణా - గోదావరి బేసిన డెల్టా డ్రైనేజి బోర్డు ప్రారంభించడానికి ఆయన కారకుడు అని మనవిచేస్తున్నాను. అనాడు విజయవాడలో మీటింగు పెట్టి అనాడు వుండె సమితి ప్రెసిడెంట్లను అందరిని ఆహ్వానించి కేవలం ప్రభుత్వమే యీ డ్రైనేజి స్కీమ్ తీసుకుంటె, ఆర్థికంగా ప్రజలనుండి సహాయం కావాలని రైతాంగాన్ని ఇన్‌వాల్వు చేయాలనిచెప్పి, ఒప్పించి అప్పుడు కృష్ణా, గోదావరి బేసిన్ డెల్టా డ్రైనేజ్ సెస్సు ఏక్టును తీసుకురావడం జరిగింది. అలాగే, బ్యాకువర్డ్ క్లాసెస్ విషయంలో అనంతరాములు కమీషన్‌ను ఆయన కాన్‌స్టిట్యూట్ చేశారు. ఎట్టి పరిస్థితులలో కూడా హైకోర్టు ఆఫ్ లాయర్స్ స్క్రుటిన్నీలో దెబ్బతినకుండా వుండె విధంగా 93 వర్గాలను గుర్తించి, ఆమోదించి, రిజర్వేషన్ యిచ్చిన మహనీయుడు. ఆ విధమైన ఎన్నో చరిత్రాత్మకమైన విషయాలు చేసినవాడు. మన అందరికి కూడా ఆదర్శప్రాయుడని మనవిచేస్తున్నాను. వారి కుటుంబానికి నా యొక్క హృదయపూర్వక సంతాపాన్ని తెలియ చేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను.

శ్రీ కె. పెద్ద కొండారెడ్డి (మార్కాపూర్):- అధ్యక్షా, పెద్దలు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. పూజ్యులు, పెద్దలు కీర్తిశేషులు

కె. బ్రహ్మానందరెడ్డిగారు లేని లోటు యీ రాష్ట్రానికి యీ దేశానికి తీరనిలోటుగా భావిస్తూ వున్నాను. పార్లమెంటరీ నియోజకవర్గము అయిన నరసారావుపేటలో మూడుసార్లు సభ్యులుగా వున్నప్పుడు చాలా చిన్నవారికి పరిచయమ్మై వారి ప్రోత్సాహంతో యీరోజు శాసనసభ్యులుగా వున్నటువంటి నాబోటి యువకులు అవకాశం కల్పించి, చాలా ఉత్సాహ పరచినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ, మిగతావిషయాలకు పోకుండా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్:- 'జాతస్య మరణం ధృవం' అన్నట్లుగా, అందరికి తెలియాలి. ఎంతోమంది పొరపాట్లు చేస్తూనే వుంటారు. చాలా మంది బ్రతికి వున్నా చచ్చినట్లుగా వుంటారు – కొందరు చచ్చినా బ్రతికినట్లుగా వుంటారు. బాధ ఒక్కటే. మంచివాడు చనిపోతే చాలామంది శాసన సభ్యులు మాట్లాడితే నాకు సమయం దొరకలేదని కోప్పడు తుంటారు. కనుక, బ్రహ్మానందరెడ్డిగారి గురించి మాట్లాడే సమయాన్ని మీ అందరికీ యిచ్చినా, యివ్వకపోయినా కోపగించవద్దని, మనం ఒకటి గ్రహించాలి వారి ఆత్మకు శాంతి జరగాలని, బ్రహ్మానందరెడ్డిగారు శాసనసభలో ఉన్నప్పుడు నేను గాలరీలో కూర్చుని
11.30 చూశాను. అది మనందరికీ గుర్తుండాలి. ఇచ్చిన సమయం కంటే ఎక్కువ తీసుకోకుండా,
ఉ. బిజినెస్ ఎడ్వయిజరీ కమిటీలో యిచ్చిన సమయాన్ని గుర్తుంచుకొని, సభా సమావేశాలు హుందాగా నడపాలనే భావన వుండాలని ఆయన ఒకసారి చెప్పినట్లు నాకు జ్ఞాపకం. ఇది పాటిస్తే ఆయన ఆత్మ శాంతిస్తుంది. ఆయన ఆత్మశాంతి కోసం మనమంతా రెండు నిముషాలు మౌనంపాటిద్దాము.

(రెండు నిముషాల సేపు సభ మౌనం పాటించింది)

మిస్టర్ స్పీకర్:- సభను రేపు ఉదయం గం॥ 8.30 నిముషములకు వాయిదా వేస్తున్నాను.

(సభ మరుసటి రోజు అనగా 12.7.94 ఉదయం 8.30 గంటలకు సమావేశమగుటకు గాను ఉదయం గంటలకు 11.35 నిముషములకు వాయిదా పడినది)